# గుంటూరు వార్త

## గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్

గుంటూరు, జూన్ 5,(ప్రభాతవార్త) :గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జిలు ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి



వినతులు, అర్జీలు స్వీకరించారు. మహమ్మద్ రఫీ, కసుకుర్తి హనుమంతరావు, గుర్రం ప్రసాద్, పరుచూరి సంజీవరావు,తన్నీరు కృష్ణ, ముప్పా వేణు బాబు, ముత్తినేని శివలీల,డా. కల్పన పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను నమోదు చేసుకుని ఎమ్మెల్యే గళ్ళా మాధవి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, భద్రత, సాధికారత కోసం ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఇలాంటి గ్రీవెన్స్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్యావరణం పై.. రైల్వే అధికారుల అవగాహన కార్యక్రమాలు

గుంటూరు జూన్ 5 ప్రభాత వార్త ప్రతినిధి : జూన్ 5న జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించడానికి దక్షి ణ కోస్తా రైల్వే గుంటూరు డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో గుంటూరు నగర రాజ భాషా అమలు సమితి సభ్యులు,, గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేషనా సేన్, ఎడిషనల్ డివిజనల్ మండల రైల్వే మేనేజర్ ఎమ్.రమేష్ కుమార్ పాల్గొన్నారు.



ఈ కార్యక్రమాల్లో డివిజన్లో ఉన్న సంబంధిత విభాగాల అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వ ఉద్యోగుల భాగస్వామ్యాన్ని ఉద్యమంగా మార్చేందుకు మొదటగా ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణంలో వచ్చే మార్పులు, నష్టాలు గురించి తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన సదస్సు ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేషనా సేన్ ఒకసారి మాత్రమే ఉపయోగించే వస్తువులు అంటే ప్లాస్టిక్ బాటిల్స్, కూల్ డ్రింక్ డబ్బాలు లాంటివి క్రష్ చేసి మరల ఉపయోగించకుండా ఉండే క్రష్ మిషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాబోయే తరం కోసం ఇప్పటి నుండి ప్లాస్టిక్ వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని అన్నారు. పరివర్తన నా నుంచి ప్రారంభం అనే నినాదాన్ని అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు , ఉద్యోగస్తులతో సంతకాల సేకరణను చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు మొక్కలు నాటే కార్యక్రమంలో వారి విభాగాల ఉద్యోగులతో కలిసి పాల్గొన్నారు. పర్యావరణం, ప్రకృతి పరిరక్షణలో భాగంగా క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు

## ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు తూర్పు నియోజకవర్గ నాయకుల సమావేశం

గుంటూరు, జూన్ 5,(ప్రభాతవార్త భారత ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సార్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ కూటమి నాయకులు సూచించారు. ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో 2, 9 క్లస్టర్లకు చెందిన కూటమి నాయకులు ప్రత్యేక సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా అప్ డేట్ చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం సార్ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. కూటమి నాయకులు సార్ గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే దీని ప్రధాన లక్ష్యమని చెప్పారు. మరణించినా, వేరే ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లినా, ఒకే వ్యక్తి పేరుపై రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నా వాటిని ఓటర్ల జాబితా నుండి తొలగిస్తారని, ఇలాంటి అంశాలపై పార్టీ నాయకులు దృష్టి సారించాలని అన్నారు. ఓటరు కార్డులో పేరు, వయస్సు, చిరునామా, ఫోటోలు తప్పుగా ఉన్నా బూత్ లెవెల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. బీఎల్వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను వెరిఫై చేస్తారన్నారు. వారితోపాటు పార్టీ నాయకులు కూడా ఉండాలని సూచించారు. అధికారులు ప్రతి ఇంటినీ సర్వే చేసిన తర్వాత, ఆ ఇంటి బయట ఓటరు సంఖ్య, బ్లో పేరు, మొబైల్ నంబర్తో కూడిన ప్రత్యేక స్టిక్కర్ను అంటిస్తారని, ఆయా వివరాలను బూత్ లెవల్ ఏజెంట్లు తెలుసుకోవాలన్నారు. సార్ జరుగుతున్న సమయంలో బీఎల్వోలకు సహకారం అందించాలని చెప్పారు.

## త్వరలో కొత్తగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ధరఖాస్తు కు అనుమతి

గుంటూరు విద్య మే 5, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అర్హులైన వయోవృద్ధులకు, వికలాంగులకు,ఒంటరి మహిళలకు ఆర్థిక సహాయం అందించేందుకు త్వరలో కొత్తగా పెన్షన్లను మంజూరు చేయ నున్నందున గుంటూరు తూర్పు నియోజక వర్గంలోని అర్హులు దరఖాస్తులు దాఖల చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ వికాస్ విద్యా సంస్థల అధినేత దాసరి రాజా మాస్టారు తెలిపారు. గుంటూరు తూర్పు శాసనసభ్యులు నసీర్ అహమ్మద్ కార్యాలయములో జరిగిన గ్రీవెన్స్ (ప్రజా



పిర్యాదుల) కార్యక్రమములో శుక్రవారం అనేకమంది నుండి అర్జీలు దాసరి రాజా మాస్టారు స్వీకరించారు.రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులలోఉన్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల సమయంలో ఇచ్చినహామీలను నెరవేర్చుతున్న విషయం అందరికి తెలిసిందే అని, ప్రజా సమస్యల పరిష్కారానికి, ఇచ్చిన హామీల అమలుకు కూట మి ప్రభుత్వం కృషి చేస్తోందని రాజా మాస్టారు అన్నారు. పరిశీలకులు శాతవాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్, క్లస్టర్లు ఏల్చూరి కిరణ్,జమీర్ పఠాన్,మల్లెంపూడి,పిచ్చి రెడ్డి, జాగర్లమూడి,చల్లాప్రసాద్, ఎస్ ఎం నిజాముద్దీన్,యూనిట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..

## వ్యక్తి అదృశ్యం

గుంటూరు క్రైమ్,జూన్5,ప్రభాతవార్త: గుంటూరు పట్టణం వసంతరాయపురం రెండవ లైనుకు చెందిన కొనపాల లక్ష్మీ ం దీపక్ తండ్రి శివశంకర్ వయస్సు 30 సంవత్సరాలు అను అతను వీడియో గ్రాఫర్ గా పని చేస్తూ జీవిస్తున్నట్లు, గత కొంతకాలంగా విజయవాడకు చెందిన ఒక మహిళతో సహజీవనం చేస్తున్నట్లు,ఆమె,ఆమె పిల్లల పోషణకు 10 లక్షల వరకు అప్పులు చేసినట్లు, ఆ విషయం ఇంట్లో తెలిసి మందులించగా ది 29 5 2026వ తేదీన సాయంత్రం 5:00 సమయంలో ఇంటి నుండి వెళ్లిపోయినట్లు,అతని ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు,అతని ఆచూకీ దొరకలేదని అతని తండ్రి అయిన శివశంకర్ ఇచ్చిన రిపోర్టు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

## పీసెట్కు 523 మంది హాజరు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్5, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా బిపిఇడి, డిపిఇడి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఏపిపీసెట్ దేహదారుడ్య, క్రీడా నైపుణ్య పరీక్షలకు మూడవ రోజు 713మందికి 523మంది హాజరయ్యారని కన్వీనర్ ఆచార్య పిపిఎస్.పాల్కుమార్ తెలిపారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. శనివారం హాల్టికెట్ నెంబరు 12145 నుంచి 12858 నెంబరు వరకు అభ్యర్థులు హాజరుకావాలని పాల్కుమార్ సూచించారు. నేటితో పురుషులకు పీసెట్ పరీక్షలు పూర్తవుతాయని పేర్కొన్నారు.

## ప్రొఫెసర్లకు నియామక పత్రాలు అందజేత

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్5, ప్రభాతవార్త: ఏఎన్యులో గురువారం జరిగిన సమావేశంలో పాలకమండలి సిఏఎస్ ఇంటర్వ్యూలకు ఆమోదం తెలిపింది. దీని ద్వారా 18మంది అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందారు. శుక్రవారం వీరికి నియామక పత్రాలను వీసి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు అందజేశారు.

## ఏఎన్యు డిగ్రీ వన్టైం ఆపర్చునిటీ పరీక్షల షెడ్యూల్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్5, ప్రభాతవార్త: ఏఎన్యు పరిధిలో ఇయర్ ఎండ్ 3ఏళ్ళ డిగ్రీ కోర్సులకు వన్టైం ఆపర్చునిటీ పరీక్షల షెడ్యూల్ను ఏసిఇ రెడ్డిప్రకాశరావు విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈనె 30లోగా ఫీజును చెల్లించాలని, రూ.100 ఫైన్తో జూలై 6లోగా చెల్లించే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. థియరీ పరీక్షలు ఆగస్ట్ 5 నుంచి జరుగుతాయని అవి పూర్తయిన తరువాత ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. థియరీకి ఒక ఏడాదిలో 3పేపర్లలోపు రూ.7260, 3పేపర్లు దాటిన తరువాత ఒక్కో పేపర్కు రూ.3580, ప్రాక్టికల్ పరీక్షలకు ఒక్కో పేపర్కు రూ.2430, 2,3 పేపర్లకు రూ,4860, అంతకంటే ఎక్కువ ఉంటే ఒక్కో పేపర్కు రూ.1820 చెల్లించాలన్నారు. వివరాలకు వర్సిటీ వెబ్సైట్ను/ డిగ్రీ కళాశాలలను సంప్రదించాలని సూచించారు.

## మొక్కలు నాటుదాం.. పచ్చదనాన్ని కాపాడుదాం

### గుంటూరు కలెక్టర్ సాయికాంత్ వర్మ

గుంటూరు, జూన్ 5 ప్రభాత వార్త ప్రతినిధి : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పేరేచర్ల వద్ద గల నగర వనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సీడ్ బాల్ లను తయారు చేశారు. మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడుకోవడంతో పచ్చదనం పెరుగుతుందని అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించుకోవడం వలన కాలుష్యకోరాల నుంచి బయటం డవచ్చని అన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతతో స్వీకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాలిథిన్ వాడకం నియంత్రిద్దామని పిలుపునిచ్చారు. జంక్ ఫుడ్ జోలికి వెళ్లవద్దని, ఆరోగ్య సంరక్షణ అవసరమని సూచించారు. పర్యావరణ హిత మార్గాలను అనుసరిద్ధామని కోరారు. గుంటూరు జిల్లాను పచ్చదనం జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. జిల్లా అటవీ అధికారి ఎం.హిమ శైలజ మాట్లాడుతూ సీడ్ బాల్ లను తయారు చేసి తద్వారా ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెరుగుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎం.డి.నజీనా బేగం మాట్లాడుతూ రెండు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గించేందుకు లక్ష మొక్కలు నాటాలని తెలిపారు. ఈ సందర్భంగా మిషన్ కూల్ గుంటూరు పోస్టర్ ను ఆవిష్కరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి, సి.ఎస్.ఆర్ ఆర్గానిక్స్ నిర్వాహకులు మొక్కల సీతారామయ్య, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బహుమతులు అందించిన ఎస్పీ

గుంటూరు క్రైమ్,జూన్5,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా పోలీస్ శాఖ,ఏపీ కన్నెగంటి.హనుమంతు స్పోర్ట్స్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మేనెల 5వ తేదీ నుండి జూన్ నెల 5వ తేదీ వరకు 25వ సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపులో బాగంగా 5 సం.ల నుండి 14 సం.ల లోపు బాలబాలికలకు నిపుణులైన మాస్టర్లచే బాస్కెట్ బాల్ అథ్లెటిక్స్ విభాగాల యందు ఉచిత కోచింగ్



ఇప్పించడం జరిగింది.ఈ ఉచిత కోచింగ్ శిబిరంలో 110 మంది బాలబాలికలు పాల్గొనగా, వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెమెంటోలు ఎస్పీ, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా అంద జేసి , అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ“విద్యార్థులలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం జట్టు భావన పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయి.వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపులో పాల్గొన్న బాలబాలికలు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవడం అభినందనీయం.క్రీడలు కేవలం శారీరక ఆరోగ్యానికే కాకుండా, జీవితంలో విజయాలను సాధించేందుకు అవసరమైన నాయకత్వ లక్షణాలు,సహనం,పోరాట స్ఫూర్తిని పెంపొందిస్తాయి.గుంటూరు జిల్లా పోలీస్ శాఖ,ఏపీ కన్నెగంటి హనుమంతు స్పోర్ట్స్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత శిక్షణ శిబిరం ద్వారా గ్రామీణ,పట్టణ ప్రాంతాల పిల్లలకు తమ ప్రతిభను వెలికితీసుకునే అవకాశం లభించింది.భవిష్యత్తులో రాష్ట్ర,జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షి స్తూ, విజేతలతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరినీ హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను“ అని తెలిపారు. ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్ గా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,జస్టిస్ డి.రాములు లేబర్ కోర్టు గుంటూరు,రిటైర్డ్ ఎస్పి చక్రపాణి,స్పెషల్ బ్రాంచ్ డీస్పీ అలహరి శ్రీనివాస్,ధనిక్ భారత్ విద్యాసంస్థల డైరెక్టర్ కందిమల్ల.సాంబశివరావు,మామిడి సీతారామయ్య,కే విజయలక్ష్మి ం,వై నాగేశ్వరరావు,అంకమరావు,టీ. శ్రీనివాసరావు కనమర్లపూడి సత్యనారాయణ,పిల్లల తల్లిదండ్రులు,క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్డే

గుంటూరు క్రైమ్,జూన్5,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే“పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే” కార్యక్రమం శుక్రవారం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న వివిధ విభాగాల పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత,సర్వీస్ సంబంధిత,బదిలీలు ,పదోన్నతులు, సెలవులు ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన



వినతులను సమర్పించారు.అందిన ప్రతి వినతిని ఎస్పీ శ్రద్ధగా పరిశీలించి,సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పోలీస్ సిబ్బంది సంక్షేమం,వారి సమస్యల పరిష్కారం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని,ఖాళీలు,అవసరాలు,పారదర్శక విధానాలను పరిగణనలోకి తీసుకుని బదిలీలు చేపడతామని ఎస్పీ తెలిపారు.ఎటువంటి సంకోచం లేకుండా,భయాందోళనలకు తావివ్వకుండా పోలీస్ సిబ్బంది తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. సిబ్బంది సమస్యలు సమర్థవంతంగా పరిష్కారమైతేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని ఆయన పేర్కొన్నారు.విధి నిర్వహణలో నిబద్ధత,క్రమశిక్షణ,సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని,ప్రజల్లో నమ్మకం,భద్రతాభావం పెంపొందించే విధంగా వ్యవహరించాలని ప్రజలు మన్ననలు అన్ని స్థాయిల పోలీస్ సిబ్బందికి సూచించారు.“పోలీస్ శాఖ ఒక కుటుంబం వంటిది. పరస్పర గౌరవం,సహకారం,సమన్వయంతో పని చేస్తే పోలీస్ వ్యవస్థ మరింత బలపడుతుంది.సిబ్బంది సంక్షేమానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను” అని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు..

## ట్రాఫిక్ పై ప్రత్యేక డ్రైవ్

గుంటూరు క్రైమ్,జూన్5,ప్రభాతవార్త; గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతను మెరుగుపరచడం,ట్రాఫిక్ నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడం లక్ష్యంగా గురువారం సాయంత్రం 6.00 గంటల నుండి రాత్రి 9.00 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ట్రాఫిక్ అమలు కార్యక్రమం నిర్వహించబడింది.ఈ ప్రత్యేక డ్రైవ్లో జిల్లాలోని 31 బ్లాక్ స్పాట్లు,మరో 21 ఇతర కీలక ప్రాంతాల్లో



విస్తృత తనిఖీలు చేపట్టారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై మొత్తం 833చలానాలు నమోదు చేసి రూ.5,01,035 జరిమానా విధించారు.ఈ ప్రత్యేక డ్రైవ్ సందర్భంగా నమోదైన ఉల్లంఘనలు,హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై - 249 కేసులు, రూ.1,03,575 జరిమానా,హెల్మెట్ ధరించని పిలియన్(వెనుక కూర్చున్న) రైడర్లపై - 22 కేసులు, రూ.20,820 జరిమానా,ట్రిపుల్ రైడింగ్పై - 195 కేసులు, రూ.1,61,175 జరిమానా,ప్రమాదకరంగా వాహనాలు నడిపిన వారిపై - 57 కేసులు, రూ.42,345 జరిమానా,రాంగ్ సైడ్ డ్రైవింగ్పై - 13 కేసులు, రూ.12,705 జరిమానా.మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపిన వారిపై - 16 కేసులు, రూ.12,310 జరిమానా.మద్యం సేవించి వాహనం నడిపిన 10 మందిపై కేసులు నమోదు చేశారు.ఇతర మోటారు వాహన చట్ట ఉల్లంఘనలకు సంబంధించి 281 కేసులు నమోదు చేసి రూ.1,48,135 జరిమానా విధించారు.అదేవిధంగా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా 15 రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల ద్వారా 225 మంది డ్రైవర్లు,80 మంది విద్యార్థులు,381 మంది సాధారణ ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.మొత్తం 686 మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలను పాటిస్తేనే బహుళ అంతస్తుల ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల మంజూరు

### నగర కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 5 ప్రభాత వార్త : నిర్దేశిత ప్రభుత్వ నిబంధనలను, ప్రమాణాలను పూర్తిగా పాటిస్తేనే బహుళ అంతస్తుల భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను మంజూరు చేస్తామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు శుక్రవారం కమిషనర్ నగరంలోని బ్రాడీపేట, ఎల్ఐసి కాలనీ, పలకలూరు రోడ్, జేకేసీ కాలేజీ రోడ్, గోరంట్ల, రామిరెడ్డి నగర్, సంతోష్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆక్యుపెన్సి సర్టిఫికెట్ కి దరఖాస్తు చేసుకున్నభవనాలను, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్స్ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాల్లో అనుమతించిన ప్లాన్కు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టారా లేదా అనే విషయాన్ని నిశితంగా పరిశీలించారు. పార్కింగ్ స్థలం, సెట్బ్యాక్స్, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు, వర్షపు నీటి సంరక్షణ గుంతలు తదితర అంశాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అని తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన భవనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు మంజూరు చేయరాదని, అన్ని ప్రమాణాలు పాటించిన భవనాలకు మాత్రమే ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే ప్లానింగ్ కార్యదర్శులు తప్పనిసరిగా తమ సచివాలయం పరిధిలో అనధికార లేదా నిర్దేశిత ప్లాన్ కి భిన్నంగా నిర్మాణాలు జరగకుండా ప్రాథమిక స్థాయిలోనే అడ్డుకోవాలని, లేకుంటే వారితో పాటు పర్యవేక్షణ అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం నగరంలోని వివిధ డివిజన్లలో జరుగుతున్న సిసి రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను పరిశీలించి, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులు పూర్తైన వెంటనే నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, విధుల్లో నిరక్ష ్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రెయిన్లలో పూడికతీత పనులను నిరంతరం పర్యవేక్షి ంచాలని ప్రజారోగ్య విభాగ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్ కుమార్, ఏసిపీ రెహ్మాన్, డిఈఈ రమేష్ బాబు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు

## నిబంధనలు పాటించని ట్రావెల్స్ బస్సు సీజ్




గుంటూరు, జూన్ 5 ప్రభాత వార్త ప్రతినిధి : నిబంధనలకు అనుగుణంగా లేని ట్రావెల్ బస్ సీజ్ చేయడం జరిగిందని రవాణా శాఖ ఉప కమిషనర్ కె.సీతారామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జబ్బార్ ప్రైవేటు ట్రావెల్స్ కు చెందిన బస్సు నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాణాలు పాటించకుండా అత్యవసర ద్వారాన్ని ఏర్పాటు చేసినట్లు గుర్తించడం జరిగిందని వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన బస్సు ను సీజ్ చేయడం జరిగిందని చెప్పారు. నిబంధనల పట్ల సుప్రీం కోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని తెలిపారు. బస్సులపై నిఘా పెట్టి వాటి నాణ్యతా ప్రమాణాలు పట్ల తనిఖీ చేయడంలో సహకరిస్తున్న అధికారులను ఈ సందర్భంగా అభినందించారు.

## ఉచిత వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు



గుంటూరు విద్య మే 5 ప్రభాతవార్త: కృష్ణ హాస్పిటల్ అండ్ లాబ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చింకా కృష్ణ మాట్లాడుతూ రోగులకు ఉచిత వైద్య సేవలతో పాటు వైద్యులు సూచించిన మేరకు ఉచితంగా మందులు కూడా అందజేశామని కృష్ణ వెల్లడించారు. వైద్య శిబిరంలో డాక్టర్ ఆదం ఖాన్, డాక్టర్ శివరామకృష్ణ వరప్రసాద్, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ పోట్ల ఉమామహేశ్వరి, డాక్టర్ ఆశ లు పాల్గొని సేవలందించారన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో అన్ని వయసుల వారికి అవసరమైన బీపీ, షుగర్, బిఎంఐ, జ్వరం, దగ్గు, జలుబు, ఆయాసం, గ్యాస్, గుండె నొప్పి, థైరాయిడ్, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తలనొప్పి, కామెర్లు, కీళ్ల వ్యాధులు, నరాల బలహీనత, అల్సర్లు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు, పక్షవాతం, మూర్ఛ వ్యాధులకు సంబంధించి అనుభవజ్ఞులైన వైద్య బృందంచే వైద్య శిబిరానికి వచ్చిన ఆయా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. గోరంట్ల ,నగరాలు, భారత్ పేట, పోస్టల్ కాలనీ, శారదా కాలనీ పొట్టి శ్రీరాములు నగరు, అమరావతి రోడ్డు తదితర ప్రాంతాల్లోని రోగులు పెద్ద ఎత్తున ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు కృష్ణ వెల్లడించారు.

## టెన్త్ విద్యార్థులకు షార్టు మార్కుల మెమో పంపిణీ గడువు పెంపు

గుంటూరు విద్య జూన్ 5 ప్రభాతవార్త: ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీ కేవీ శ్రీనివాసులు రెడ్డి వారిఆదేశాల మేరకు గుంటూరుజిల్లాలోనిఅన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలాగిన్ లో ఉన్న పదవ తరగతి పరీక్షల షార్ట్ మార్కుల మెమోలను డౌన్లోడ్ చేసుకొని సంతకము, సీల్ తో విద్యార్థులకు అందించే సదుపాయమును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష తెలియజేశారు.


## ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము

**ఫారం నెం .VII**

[చట్టం నెం.30/2013 లోని సెక్షన్ 19(1) మరియు రూలు25(1)ప్రకారం]

**రూఢి ప్రకటన**

ఆర్ .సి.నెం.01/2026- CRDA (Admin) తేది: 03-06-2026.

క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరచిన గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామములో గల 2.335 ఎకరముల భూమి ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం అనగా "అమరావతి రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్ లో భాగముగా – సీడ్ ఆక్సెస్ రోడ్డు నిర్మాణం నిమిత్తము" అవసరమని,అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన గుంటూరు జిల్లా కలెక్టరు గారు భావించుచున్నందున, సదరు భూముల యందు ఆసక్తి గల వ్యక్తులు అభ్యంతరములను దాఖలు చేసినందున చట్టం 30/2013 లోని సెక్షన్ 15 ప్రకారము విచారణ మీదట మరియు ఆంధ్ర ప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, రాయపూడి వారు భూసేకరణకు అవసరమగు పైకమును వాయిదాలలో జమ చేసి యున్నందున సంతృప్తి చెందినవారై గుంటూరు జిల్లా కలెక్టరు గారు చట్టం 30/2013 లోని సెక్షన్ 19(1) ప్రకారము ఈ క్రింది డిక్లరేషను చేయుచున్నారు.

**రూఢి ప్రకటన**

దిగువ షెడ్యూలులో పేర్కొనిన 2.335 ఎకరముల భూమి , చట్టం 30/2013 (కేంద్ర చట్టం) లోని సెక్షన్ 19(1) ప్రకారము ప్రజాహిత కార్యక్రమాలకు అనగా "అమరావతి రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్ లో భాగముగా – సీడ్ ఆక్సెస్ రోడ్డు నిర్మాణం నిమిత్తము" ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, రాయపూడి వారు ఏర్పాటు చేయుటకు అవసరమని గుంటూరు జిల్లా కలెక్టరు గారు ధ్రువీకరించు చున్నారు.

**షెడ్యూలు**

జిల్లా: **గుంటూరు** మండలము: **తాడేపల్లి** గ్రామము : **ఉండవల్లి**

| వరుస నెం | సర్వే నెం. | మొత్తము విస్తీర్ణము (ఎ.లలో) | సేకరించ వలసిన విస్తీర్ణము (ఎ.లలో) | ఆసక్తి గల వ్యక్తులపేర్లు | హద్దులు | | | | చెట్లు / కట్టడములు / పంటలు మొదలగునవి |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | ఉత్తరము | దక్షిణము | తూర్పు | పడమర | |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | | | | 7 |
| 1 | 22-సి2 | 0.265 | 0.265 | దండమూడి సాంబశివ రావు (రామస్వామి) | 22/ సి 1 | 22 / సి3 | 22/ బి | 24 | లిల్లీ పంట |
| 2 | 27-ఎ1 | 0.33 | 0.33 | దండమూడి సాంబశివ రావు (రామస్వామి) | 26 & 27/ఎ 2 | 27/ బి | 27/ఎ 2 | 28 | కొత్తిమీర పంట |
| 3 | 28-బి1 | 0.28 | 0.28 | గాదె హనుమంత రావు నాయుడు (బలరామ్ మూర్తి) | 29 | 41 | 28 /బి 2 | 28/ ఎ | తాటి చెట్లు -2 మోటారు పంపు, గులాబీ తోట |
| 4 | 238-1 | 0.60 | 0.30 | గుర్రాల గోపాల్ మైనర్ గార్డియన్ ఫాదర్ ఏడు కొండల రావు | 240 | 236 | 238/2 | 239 | మునగ పంట అరటి పంట |
| 5 | 238-1 | 0.60 | 0.30 | గుర్రాల సాయి బిట్టి బాబు (శ్రీనివాస రావు) | 240 | 236 | 238/2 | 239 | |
| 6 | 262-ఎ2బి | 0.08 | 0.08 | మేకా విజయ్ కుమార్ రెడ్డి (ధర్మారెడ్డి) | 263 | పెను మాక గ్రామం | 262బి | పెనుమాక గ్రామం& 262/ఎ 1 | అరటి పంట, మోటారు పంపు |
| 7 | 266-2బి | 0.43 | 0.43 | శింగంశెట్టి అనుపమ | 266/2 బి | 263 | 266/ 1 బి | 266/ 2 బి | ఎసిసి రూఫ్ 1-ఇనపరేకు రూఫ్-1, మోటార్ పంప్ & ఉల్లి పంట |
| 8 | 268-2బి3బి | 0.35 | 0.35 | పోలిశెట్టి సాంబశివరావు | 268/1 బి | 263 | 267 | 268/ 2బి 3ఎ | అరటి పంట |
| | మొత్తం | | 2.335 | | | | | | |

స్పెషల్ డిప్యూటీ కలెక్టరు మరియు భూసేకరణ అధికారి, ఉండవల్లి వారి కార్యాలయము నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పనిదినములలో కార్యాలయ వేళలందు పరిశీలించుకొనవచ్చును.

సదరు భూసేకరణ వలన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబములు మరియు ప్రాజెక్టు వలన ప్రభావితము కాగల కుటుంబములు (PDFs/PAFs) ఏమియూ లేవు.

ప్రాజెక్ట్ నిర్మాణ దశలో అవసరమైన భాగములో గనులు మరియు ఖనిజములు త్రవ్వుట, తొలగించుట , వినియోగించుట తప్ప భూసేకరణ షెడ్యూలు లో మిగిలిన భూములలో ఉన్న బొగ్గు గనులు, యినుపరాయి, పలకరాయి లేదా యితర ఖనిజములు అవసరము లేదు.

స్థలము: గుంటూరు
తేది: 03-06-2026

సం/- **సియం.సాయికాంత్ వర్మ, ఐ.ఏ.యస్.**
**జిల్లా కలెక్టర్, గుంటూరు**

## ఏఎన్‌యులో మొక్కలు నాటిన అధికారులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్, ప్రభాతవార్త: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఎన్‌యులో రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు శుక్రవారం



మొక్కలు నాటారు. ధరిత్రి సంరక్షణ చైతన్య సొసైటీతో కలిసి సంయుక్తంగా పరిశోధకుల వసతిగృహాల సమీపంలో బత్తాయి, సీతాఫలం మొక్కలు నాటి పర్యవరణ ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా రెక్టార్ శివరాం ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణ బాధ్యత కేవలం ప్రభుత్వాలదే కాదని ప్రతీ ఒక్కరిదన్నారు. సామాజిక బాధ్యతగా తతీసుకుని పర్యావరణ పరిరక్షణలో అందరం భాగస్వాములుగా నిలువాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సేవలు భావితరాలకు ఆదర్శంగా ఉంటాయన్నారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు మొక్కలను విస్తృతంగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలుర వసతిగృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య కె.మల్లిఖార్జున, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దివ్యతేజోమూర్తి, సొసైటీ సభ్యులు సొంబాబు, పరిశోధకులు రమాకాంత్, అజీజ్, శాస్త్రి, సాయి చరణ్‌గుప్తా, బ్రహ్మం, తనూజ్, వెంకట్, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్‌యులో పుస్తకావిష్కరణ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్5, ప్రభాతవార్త: వర్సిటీ విశ్రాంత ఉద్యోగి సిహెచ్.హరిబాబు 5వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకాల సంపుటి ఒకే ఒక్కడు పుస్తకాన్ని శుక్రవారం వికాస భవన్‌లో మాజీ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, ఏఎన్‌యు వీసి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిబాబు సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో సిఇగా ఉద్యోగ



విరమణ చేసిన ఆలపాటి శివప్రసాద్‌కు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఇ ఎన్.వెంకటేశ్వరరావు, ఐద్వా అధ్యక్షులు డి.రమాదేవి, ఈదా మాధవరెడ్డి, వై.నేతాజి, ఎ.కృష్ణకుమారి, వికాస కార్యదర్శి జె.శ్రీనివాసరావు, భానుప్రసాద్, ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్, దినసరి ఉద్యోగులు, హాస్టల్ వర్కర్‌లు, వాచ్ అండ్ వార్డ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: ఎమ్మెల్యే బూర్ల

వట్టిచెరుకూరు, జూన్ 5, ప్రభాతవార్త : పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిపై ఉందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పెదనందిపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి ఎమ్మెల్యే సైకిల్ నడుపుకుంటూ వచ్చి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నేతలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సైకిల్ ర్యాలీ స్ఫూర్తితో ఈరోజు పెదనందిపాడులో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి సైకిల్ పై వచ్చి హాజరైనట్లు చెప్పారు. కూటమి



నాయకులు, కార్యకర్తలతో కలిసి పెదనందిపాడు వీధుల్లో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తూ, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించిన్నట్లు వివరించారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సమాజానికి సైకిల్ వినియోగం ద్వారా గొప్ప సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. ఆస్ఫూర్తితో సైకిల్ పై వచ్చి కార్యక్రమానికి హాజరైనట్లు తెలియజేశారు. వాహనాల వినియోగం వల్ల పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ వారంలో కనీసం ఒకరోజు సైకిల్ ను వినియోగించాలని సూచించారు. దీంతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్య సంరక్షణ కూడా సాధ్యమవుతోం పర్యావరణాన్ని కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడటమే అన్నారు. కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయం: కలెక్టర్ సాయి కాంత్ వర్మ

పెదనందిపాడు, జూన్ 5, ప్రభాతవార్త : ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతోందనిజిల్లా కలెక్టర్ సియం.సాయి కాంత్ వర్మ పేర్కొన్నారు. ఒక నెలఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని పెదనందిపాడు మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ సంయుక్తంగా పెదనందిపాడు, కాకుమాను మండలాలకు చెందిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జిల్లాలో ఒక నెలఒక నియోజకవర్గంనాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా యంత్రాంగం సంకల్పించిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరువ చేయుటకు, వాటిపై అవగాహన కల్పించుటకు ఇది ఒక మంచి వేదికని తెలియజేశారు.దీంతో ప్రజల ముంగిటకే ప్రభుత్వం వెళ్ళి వారి



సమస్యలు తెలుసుకుని పరిష్కరించుటకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రజల నుండి స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన, సంతృప్తికరమైన పరిష్కారం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. కార్యక్రమాన్ని దిగ్విజయంగా జిల్లాలో నిర్వహించుటకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే డా.బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ..జిల్లాలో మొట్ట మొదటిసారిగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషదాయకం అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారంలో ముఖ్యమంత్రికి ప్రత్యేక శ్రద్ధ ఉందని పేర్కొన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి మాట్లాడుతూ ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో 149 అర్జీలు స్వీకరించగా ఇందులో 115 రెవెన్యూకు సంబంధించిన సమస్యలు అందాయన్నారు. 26 అర్జీలు పరిష్కారం జరిగాయని తెలిపారు. పొదుపులో భాగంగా గుంటూరు నుండి పెదనందిపాడు వెళ్ళుటకు జిల్లా అధికారులు, సిబ్బందికి బస్సులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెనాలి ఇన్చార్జ్ సబ్ కలెక్టర్ లక్ష్మీ ్మకుమారి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు, రవాణాశాఖ ఉప కమిషనర్ సీతారామిరెడ్డి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎద్ల భాస్కరరావు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి ్మ, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు వెంకటరవణప్ప, ఇతర జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలకు ఉచితంగా మార్చురీ వ్యాన్ అందజేత

మంగళగిరి, జూన్ 5, ప్రభాతవార్త: మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలకు స్వచ్ఛంద సేవా సంస్థ హార్వెస్ట్ ఇండియా ఆధ్వర్యంలో మార్చురీ వ్యాను ను ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా దంపతులు అందజేశారు. మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు తెలుగుదేశం నాయకుడు హార్వెస్ట్ ఇండియా మేనేజర్ సుద్దపల్లి నాగరాజు అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను స్ఫూర్తిగా తీసుకొని వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. హార్వెస్ట్ ఇండియా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు వెల్లడించారు. ఈ వ్యాను ద్వారా చివరి ప్రయాణం ఉచితంగా గౌరవప్రదంగా జరుగుతుందన్నారు. బడుగు బలహీన వర్గాలక ఉపయోగపడుతుందని తెలిపారు. హార్వెస్ట్ ఇండియా అధినేత డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేద ప్రజల కోసం ఈ వ్యానును అందజేస్తున్నమన్నారు. గుంటూరు జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ఒక వ్యానును అందజేయనున్నట్టు వెల్లడించారు. పార్లమెంటరీ నియోజకవర్గం అధికార ప్రతినిధి పోతిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన హార్వెస్ట్ఇండియా సంస్థ కు అభినందనలు తెలిపారు. వైద్యశాల సూపరింటెంట్ పి. స్నేహ మాట్లాడుతూ చనిపోయిన వారి దేహాలను పేదవారు తమ స్వస్థల లకు తీసుకు వెళ్లాలంటే ఖర్చుతో కూడిన పని అవుతుందని ఈ వ్యాను వలన వారికి చాలా ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టి టిడి బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, టిడిపి పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ ఇబ్రహీం, పట్టణ ప్రధాన కార్యదర్శి రియాజ్, బీసీ నాయకులు జొన్నాదుల బాలకృష్ణ, బైరుబోయిన శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## చలానాల భయంతో కాదు... ప్రాణరక్షణ కోసమే హెల్మెట్ ధరించాలి

బాపట్ల, జూన్ 5, ప్రభాతవార్త ప్రతినిధి :బాపట్ల సబ్ డివిజనల్ పోలీస్ (డీఎస్పీ) కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించిన ఆయన సబ్ డివిజన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితిపై, వివిధ నేరాల సరళిపై సుదీర్ఘంగా సమీక్షి ంచారు. ప్రాంతాలవారీగా జరుగుతున్న నేరాలను పూర్తిగా కట్టడి చేయడానికి తీసుకుంటున్న ముందస్తు చర్యల గురించి అధికారులను ఆరాతీశారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షి ంచవద్దని అధికారులను ఆదేశించారు. రాత్రి గస్తీ ముమ్మరం చేసినేరాల నియంత్రణకు ప్రతి ఒక్క అధికారి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలన్నారు. పోలీస్ స్టేషన్లలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేసి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో ప్రజలతో పోలీసులు స్నేహపూర్వకంగా (ఫ్రెండ్లీ పోలీసింగ్) మెలగాలని, బాధితులకు భరోసా కల్పించాలని సూచించారు.

**చలానాల భయం వద్దు... హెల్మెట్‌తోనే ప్రాణరక్ష !:** జిల్లాలో సాగుతున్న శిరోరక్ష ప్రాణ రక్ష కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు .ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించాలన్నారు. పోలీసులు చలానాలు విధిస్తారనే భయంతో కాకుండా, తమ ప్రాణాల రక్షణ కోసం స్వతహాగా బాధ్యతతో హెల్మెట్ ధరించేలా ప్రజల్లో మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ సిహెచ్.చంద్రమోళి, బాపట్ల పట్టణ సిఐ రాంబాబు, రూరల్ సీఐ ప్రభాకర్, పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నూరుశాతం పక్కాగా నిర్వహించాలి

పొన్నూరు, జూన్ 5,ప్రభాతవార్త: ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ నూరుశాతం పూర్తి చేయాలని నియోజకవర్గ ఓటు నమోదు అధికారి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధీరావత్ దుర్గాబాయి ఆదేశించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో బిఎల్వోల సమావేశంలో ఆమె



మాట్లాడారు. బిఎల్వోలకు కేటాయించిన స్టేషన్ల వారీగా వారు ఏ మేరకు ఓటర్ల మ్యాపింగ్ పూర్తిచేశారో అనే విషయాలను స్వయంగా అడిగి తెలుసుకొన్నారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం బిఎల్వోలు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. నూరుశాతం మ్యాపింగ్‌ను పూర్తి చేయని బిఎల్వోలపై చర్యలు తీసుకొంటామన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం బిఎల్వోలకు ఉంటుందన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు నెల రోజులపాటు బిఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటర్ల నమోదును చూడాల్సి ఉంటుందన్నారు. 18సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు ఇవ్వాలన్నారు. మృతి చెందిన, డబుల్ ఎంట్రీలను తొలగించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నూరుశాతం పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. సమావేశంలో తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, సహాయ గణాంకాధికారి నల్లాని ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ పిన్నిబోయిన పోతురాజు, మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, పట్టణ ప్రణాళికాధికారి రఘురాం తదితరులున్నారు.

## బిఎల్యేల జాబితా కమిషనర్‌కు అందజేత

పొన్నూరు, జూన్ 5,ప్రభాతవార్త: ఓటర్ల జాబితా ప్రత్యేక కార్యక్రమమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ఇంటింటి సర్వే త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీకి సంబంధించి పట్టణంలోని పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన బిఎల్యేల జాబితాను మునిసిపల్ కమిషనర్ పోతురాజుకు వైకాపా పట్టణాధ్యక్షుడు షేక్ నాజర్ అందజేశారు. పోలింగ్ స్టేషన్లవారీగా బిఎల్యేల జాబితాతోపాటు వారి ఫోటో, ఓటరు కార్డు తదితర వివరాల జాబితాను అందజేశారు. ఓటర్ల జాబితా పక్కాగా తయారు చేసేందుకు తమ వంతు కర్తవ్యాన్ని



నిర్వహిస్తామని, బిఎల్వోలకు సహాయసహకారాలు అందిస్తామని నాజర్ కమిషనర్‌కు తెలిపారు.

## రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

పొన్నూరు, జూన్ 5,ప్రభాతవార్త: రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రీ సర్వే జరుగుతున్న గ్రామాల విఆర్వోలు, విలేజి సర్వేయర్లతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రీ సర్వేలో కొంత మంది సర్వేయర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిపై చర్యలు తీసుకొంటామన్నారు. నాల్గవ విడతలో జూపూడి, జడవల్లి, వెల్లలూరు, ములుకుదురు,



కొండముది, మునిపల్లె గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందన్నారు. ప్రస్తుతం విలేజి సర్వేయర్ లాగిన్ అయిపోయిందన్నారు. విఆర్వో లాగిన్ జరుగుతుందన్నారు. ఈ నెల 15వ తేదీలోపు విఆర్వో లాగిన్‌ను పూర్తి చేయాలన్నారు. మరో 15రోజుల తర్వాత తహశీల్దార్ లాగిన్ ప్రారంభించి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఐదవ విడతలో చింతలపూడి, నండూరు, మామిళ్ళపల్లి, వడ్డిముక్కల గ్రామాల్లో రీ సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. ఈ గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ వేగవంతంగా సాగుతుందన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. తెనాలి డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ మేకపోతుల పార్థసారధి మాట్లాడుతూ విఆర్వోలు, గ్రామ సర్వేయర్లు సమన్వయంతో పనిచేసి రైతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాన్నారు. రైతులకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయాల్సి న బాధ్యత విఆర్వోలు, గ్రామ సర్వేయర్లపై ఉందన్నారు. ఏది ఏమైనా ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం రీ సర్వేను పూర్తి చేయాల్సి న అవసరం ఎంతైనా ఉందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ కార్యాలయం సూరింటెండెంట్ షేక్ కరీముల్లా, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులున్నారు.

## వ్యర్థాల నుంచే సంపద సృష్టి సాధ్యం

పొన్నూరు, జూన్ 5,ప్రభాతవార్త: చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ పొల్యూషన్ అండ్ కంట్రోల్(సీఈపీసీ), స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ పరిధిలోని రసాయన శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2026వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీఎస్ఐఆర్ ఇండియన్ ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎ.గంగాగ్నిరావు వెల్త్ అవుట్ ఆఫ్ వేస్ట్ ఎనర్జీ సెక్యూరిటీ అండ్ సస్టైనబుల్ ఫార్మింగ్ అంశంపై ప్రత్యేక ఉపన్యాసం అందించారు. వ్యర్థాలను విలువైన వనరులుగా మలిచే ఆధునిక సాంకేతికతలు, వ్యర్థాల నుంచి ఇంధన ఉత్పత్తి విధానాలు, సుస్థిర వ్యవసాయానికి అవి అందించే ప్రయోజనాలను వివరించారు. వలయాకార ఆర్థిక వ్యవస్థ సూత్రాలు, కాలుష్య నియంత్రణ చర్యలు, పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థిక ప్రయోజనాలను సాధించే మార్గాలను విశదీకరించారు. శాస్త్రీయ ఆవిష్కరణలు పర్యావరణ సంరక్షణకు,



సుస్థిర అభివృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రకృతితో సమన్వయంగా జీవించడం ద్వారానే మానవాళి భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందన్నారు. భారతీయ సంస్కృతిలో పంచభూతాలైన భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రకృతి సమతుల్యతను కాపాడడం ద్వారా పర్యావరణ రక్షణతో పాటు మానవ సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. స్థిరమైన జీవన విధానాలను అలవరచుకుని పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి కర్తవ్యం

పొన్నూరు, జూన్ 5,ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అనే విషయాన్ని ప్రతి పౌరుడు గుర్తించాలని రోటరీక్లబ్ కార్యదర్శి యాసం వీరయ్య పిలుపునిచ్చారు. స్థానిక డంపింగ్ యార్డు వద్ద మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో యాసం వీరయ్య మాట్లాడుతూ మానవులమైన మనం పర్యావరణాన్ని మన ఇష్టం వచ్చినట్లు ఉపయోగిస్తుండడం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. దీని ద్వారా మనం అనేక రోగాల బారిన పడుతున్నామన్నారు. అంతేకాక సకాలంలో వర్షాలు కూడా కురవడం లేదన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. మునిసిపల్ కమిషనర్ పిన్నిబోయిన పోతురాజు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మొక్కలను నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. పట్టణంలోని వీధుల్లో, రోడ్లు, కాలువల్లో చెత్తా



చెదారాలను వేయకుండా ప్రజలందరూ బాధ్యతగా మెలగాలన్నారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ నాయకులు నన్నపనేని బాలకృష్ణ, నన్నపనేని రవీంద్రనాథ్, షేక్ యాసిన్‌బాబా తదితరులున్నారు.

## చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్ కోసం నవచేతన యాప్

నిజాంపట్నం, జూన్ 5, ప్రభాతవార్తః చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్ కోసం నవచేతన యాప్ ఎంతో ఉపయోగపడుతుందని డాక్టర్ సాయికృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నిజాంపట్నంలోని బిసి గురుకుల పాఠశాలలో అంగన్‌వాడీ వర్కర్స్‌కు నవచేతన యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవచేతన యాప్‌లో ఎఐ ఆధారిత ఈసిడి స్క్రీనింగ్ ఉంటుందన్నారు. 0-6 పిల్లల్లో ఆరోగ్య అభివృద్ధి లోపాలు గుర్తించవచ్చని తద్వారా వైకల్యాలు ప్రారంభదశలో గుర్తించటం ద్వారా చిన్నవయస్సులోనే సరిచేయవచ్చన్నారు. సిడిపిఓ అనసూయ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో నవచేతన యాప్ ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పజా సమస్యల పరిష్కారంపై అధికారుల చర్యలు అభినందనీయం: ఎమ్మెల్యే ఆనందబాబు

రేపల్లె, జూన్ 5, ప్రభాతవార్త:ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరించడం అభినందనీయమని వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు అన్నారు.శు క్రవారం అమృతలూరులో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలు ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో,మండల



కార్యాలయాలలో జరుగుతున్నాయని చెప్పారు.ప్రతి వారం నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు.నెల రోజులపాటు ఒకే నియోజకవర్గంలో పిజిఆర్ఎస్ నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఆనందబాబు వెల్లడించారు.వేమూరు నియోజకవర్గంలో ప్రజా సమస్యల అర్జీలు తక్కువగా ఉన్నందున వెంటనే పరిష్కరించాలని సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.అధికారులు అర్జీదారుల వద్దకు వెళ్ళి అర్జీలకు పరిష్కారం చేయకుండానే పరిష్కారం చూపినట్లు పేర్కొంటున్నారని ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆయన చెప్పారు.అదే జరిగితే అధికారులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ మాట్లాడుతూ వన్‌మంత్ ఫోర్ విజిట్స్ కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లాలోనే మొదటగా వేమూరు నియోజకవర్గం పరిధిలోని అమృతలూరు,వేమూరు,కొల్లూరు మండలాల పరిధిలో పిజిఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.మండలంలో సెన్సెస్,ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖల సచివాలయ సిబ్బందిని బిఎల్‌వోలుగా నియమించడం జరిగిందని చెప్పారు.ప్రతి బిఎల్‌వో ప్రతి రోజూ 50 మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డ్వామా,స్త్రీ శిశు సంక్షేమ,గృహ నిర్మాణ సంస్థ పి.డిలు విజయలక్ష్మి,రాధమాధవి,వెంకటేశ్వరరావు,డిసిహెచ్ ఎస్.పద్మావతి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఎ.లక్ష్మి,గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఇ ఇ.ఆనంతరాజు,పౌరసరఫరాల శాఖ డిఎం శ్రీలక్ష్మి,జిల్లా భూ రికార్డుల విభాగం ఎ.డి సాంబశివరావు,పశు సంవర్ధక శాఖ జెడి వేణుగోపాల్,మార్కెటింగ్ ఎ.డి డి.రమేష్,పంచాయతీ రాజ్ ఇఇ రాజన్‌బాబు,జలవనరుల శాఖ ఎస్ఇ గోపీనాథ్,ఆర్అండ్‌బి డిఇ అరుణ,డిఎల్‌డివోలు విజయలక్ష్మి,పద్మావతి,రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి,డివిజన్,మండల స్థాయి అధికారులు,తహశీల్దార్‌లు,మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

రేపల్లె, జూన్ 5, ప్రభాతవార్త:పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రేపల్లె పారా లీగల్ వాలంటీర్లు వాగోలు బాబూరావు,చెన్ను నాగమల్లేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, ఎ.మోషే,జె.సుబ్రహ్మణ్యం,కె.వెంకయ్యలు ప్రజలకు చైతన్యం కలిగించారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో శుక్రవారం మొక్కలు నాటే కార్య క్రమం చేపట్టారు. ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపదలను కాపాడుకోవాలని సూచించారు.ప్రస్తుత తరుణంలో కాలుష్య సమస్యను ఎందుర్కొంటున్నామని చెప్పారు.పకృతిని ప్రేమించాలని పచ్చని భూమిని భావితరాలకు అందించాలని వారు కోరారు.

## ఆర్టీసీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, జూన్ 5, ప్రభాతవార్త:రేపల్లె డిపోలో ఆర్టీసీ హైర్ బస్,ఆన్ కాల్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కోశాధికారి సిహెచ్.మణిలాల్ డిమాండ్ చేశారు.శుక్రవారం రేపల్లె సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశానికి రేపల్లె డిపో హైర్ బస్ ఆన్ కాల్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు అధ్యక్షతవహించారు.ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ కెఎంపిఎల్ పేరుతో ఆన్‌కాల్ డ్రైవర్లను విధి నిర్వహణకు దూరం చేస్తున్నారని తెలిపారు.కండిషన్‌లో లేని బస్సుల డ్యామేజ్ వలన డ్రైవర్లకు ఆర్థికభారం ఏర్పడుతున్నదని ఇదే పద్ధతి కొనసాగితే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.రాష్ట్ర వ్యాప్తంగా చాలో డిపోల్లో కాల్ డ్రైవర్ల డ్యూటీకి రూ.1600 నుండి రూ.2 వేలకు పెంచి అమలుచేస్తుంటే రేపల్లె డిపోలో పెంచకపోవడం విచారకరమన్నారు.బ్రేక్ డౌన్ రిపేర్ సమయంలో పూర్తి డ్యూటీ డబ్బులు ఇవ్వాలని ఆయన సూచించారు.ఆర్టీసీ ఎండి సర్క్యులర్ ప్రకారం పిఎఫ్,ఎస్ఐ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మదర్ థెరిస్సా హైర్ బస్ డ్రైవర్స్ యూనియన్ రేపల్లె డిపో కన్వీనర్ కేసన గోపి,ఉపాధ్యక్షులు భాను,నాగరాజు,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రేపల్లె, జూన్ 5, ప్రభాతవార్త:రేపల్లె పట్టణంలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఇఇ డి.శ్యామ్ సుధాకర్‌బాబు శుక్రవారం తెలిపారు.టౌన్ ఫీడర్ అత్యవసర మరమ్మతుల కారణంగా నిజాంపట్నం రోడ్,ఇసుపల్లి, బస్టాండ్ సెంటర్,బేతపూడి,ఉయ్యూరువారిపాలెం,తురకపాలెం,జెఎల్‌బి రోడ్డు,మసీద్ సెంటర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత: మత్తి భాస్కరరావు



చెరుకుపల్లి, జూన్ 5 , ప్రభాతవార్త : భావితరాలకు మనము అందించాల్సి న వారసత్వ సంపద స్వచ్ఛమైన వాతావరణం అని రేపల్లె నియోజకవర్గం జనసేన పార్టీ కన్వీనర్ మత్తి భాస్కరరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్స వ సందర్భంగా శుక్రవారం మండలంలోని పూషడుపువారిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేయరాదు

నగరం, జూన్ 5, ప్రభాతవార్త: రోడ్డు మార్జిన్ లోఎవరు వ్యాపారం చేయరాదని నగరం ఎస్సై డి. చెన్నకేశవులు అన్నారు. శుక్రవారం నగరం మండల పరిధిలోని రోడ్డు మార్గంలో వ్యాపారాలు చేసే వారితో మాట్లాడారు. రోడ్డు మార్జిన్ లో వ్యాపారాలు చేసినట్లయితే వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రోడ్డు మార్జిన్ లో ఎవరు కూడా తోపుడు బండ్లు, వీధి



వ్యాపారులు ఉండరాదని తెలియజేశారు. అనంతరం వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వారి ప్రాణాలను కాపాడుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన అవసరం



పొన్నూరు, జూన్ 5,ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన అవసరం ఎంతైనా ఉందని ప్రవాస ఆంధ్రులు అమెరికాలో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో మాస్టర్ జానకి సూర్యదేవర అన్నారు. చేబ్రోలు ఆర్వీఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. జానకి మాట్లాడుతూ మనమందరం కలిసి పర్యావరణాన్ని పరిక్షించాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్వీ కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఇంటి పరిసరాలలో మొక్కలను నాటడంతోపాటు వాటిని పరిరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. నేడు పర్యావరణంలో వస్తున్న మార్పుల వల్ల మనమందరం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. భూమిపై గుబురు శాతాన్ని పెంచాల్సి న బాధ్యత ప్రతి పౌరుడిపై ఆధారపడి ఉందన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ఆర్ వంశీకృష్ణ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాలువల్లో చెత్త వేయకండి...

పొన్నూరు, జూన్ 5,ప్రభాతవార్త: కాలువల్లో చెత్త వేయవద్దని మునిసిపల్ కమిషనర్ పిన్నిబోయిన పోతురాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొండముది రోడ్డులోని కాలువల్లో సిల్ట్‌ను తొలగించారు. వీధులను, కాలువలను పరిశుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవాల్సి న బాధ్యత మునిసిపల్ సిబ్బందితోపాటు ప్రజలపై కూడా ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా



తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అమృతలూరులో పిజిఆర్ఎస్‌కు 74 అర్జీలు

రేపల్లె, జూన్ 5, ప్రభాతవార్త:రేపల్లె రెవెన్యూ డివిజనల్ పరిధిలోని అమృతలూరులో శుక్రవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 74 అర్జీలు అందాయి.వన్‌మంత్ ఫోర్ విజిట్స్ కార్ యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల నుండి అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు.అమృతలూరు తహశీల్దార్ కార్యాలయం నుండి గతంలో పిజిఆర్ఎస్‌లో అర్జీదారులు అందజేసిన సమస్యలకు సంబంధించి నేరుగా లబ్ధిదారులతో మాట్లాడి సమస్యల అర్జీలను పరిశీలించామని సమస్యలను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా అమృతలూరు మండలంలోని గోవాడలో అంకమ్మ చెరువు గట్టుపై, ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఆవరణలో మొక్కలు నాటిన కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు.అనంతరం గోవాడ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్క్ స్థలాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు,రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి,ఆర్అండ్‌బి డిఇ అరుణ,తహశీల్దార్ కె.నెహ్రూ,ఎంపిడివో మారుతి శేషమాంబ,పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ఈశ్వర్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

నరసరావుపేట టౌన్, జూన్ 5 ప్రభాతవార్త : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భముగా శుక్రవారం కేసానుపల్లి గ్రామంలోని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో పర్యావరణ పరిరక్షణ, సుస్థిరతపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. నాగమల్లేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ షేక్ .కరీమ్ మొహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్. మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ కాలుష్యం, అటవీ నిర్మూలన మరియు వనరుల మితిమీరిన వినియోగం వంటి మానవ కార్యకలాపాలు సహజ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయని వివరించారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ సంక్షోభం గతంలో ఎన్నడూ లేనంత తీవ్రంగా ఉందని, ఒకవైపు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు అసాధారణ వర్షాలు, ఆకస్మిక వరదలు, తీవ్రమైన కరువులు ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయని తెలిపారు. కావున పర్యావరణాన్ని కాపాడుకోవాలని కాపాడుకోవాలని బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్. నజీమా, ప్లేస్ మెంట్ ఆఫీసర్ షేక్. ముజీర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గంగాధర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.




## సోలార్ యూనిట్‌ను దహనం చేసిన దుండగులు
### న్యాయం చేయాలని కోరుతున్న బాధితుడు

నరసరావుపేట క్రైమ్, జూన్ 5 ప్రభాతవార్త : నరసరావుపేట మండలం, ఇక్కురు గ్రామానికి చెందిన వజ్జా వెంకటేశ్వరరావుకు చెందిన పొలంలోని సోలార్ యూనిట్ ను గుర్తుతెలియని దుండగులు కాల్చివేశారు. భూమిని సాగు చేసేందుకు కరెంటుకు బదులు తాను సోలార్ యూనిట్ను ఏర్పాటు చేసుకున్నానని బాధితుడు తెలిపాడు. ఈనెల 4న తాను చేను వద్దకు వెళ్లగా చేలో ఉన్న సోలార్ ప్లేట్లు, డ్రిప్ పైపులు, కేసింగ్ పైపులు కాలిపోయి ఉండడాన్ని గమనించానని అన్నాడు. ఈనెల 3 అర్ధరాత్రివేళ ఇది జరిగి ఉంటుందని అతను అనుమానం వ్యక్తం చేశాడు. సోలార్ యూనిట్, ఇతర నష్టపోయిన వస్తువులు అన్ని కలిపి సుమారు రూ.4,00,000 లకు పైనే విలువ ఉంటుందని వెంకటేశ్వరరావు చెబుతున్నాడు. సోలార్ ప్లాంటు, ఇతర వస్తువులను కాల్చిన దుండగులను పట్టుకొని తనకు న్యాయం జరిగేలా చేయాలని పోలీసులను కోరుతున్నాడు.



## పర్యావరణ పరిరక్షణకే సైకిల్ యాత్ర: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, జూన్ 5 ప్రభాతవార్త : సిఎం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు నరసరావుపేట నియోజకవర్గంలో ఈ కార్యక్ర మాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే అరవిందబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం మోటార్ వాహనాలకు బదులుగా సైకిళ్లను ఉపయోగించాలనే సందేశంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర ప్రారంభమైంది. కాలుష్య నియంత్రణ, ఇంధనఆదా, ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగాప్రజలంతా సైకిళ్లు,ఈసైకిళ్లను వినియోగించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. అనంతరం తన కార్యాలయ ఆవరణలో చెట్లు నాటండి – ప్రకృతిని కాపాడండి అనేనినాదంతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు ముందుకురావాలని కోరారు. రాష్ట్రం లో ప్రస్తుతం 31.33 ఉన్న గ్రీన్ కవర్‌ను 2030 నాటికి 37 , 2047 నాటికి 50 కి పెంచాలనే లక్ష్యంతో సీఎం పనిచేస్తున్నారని తెలిపారు. అలాగే నో వెహికల్ డే పాటిం చాలని, ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని బయోడైవర్సిటీ పార్కుగా మార్చి నెట్ జీరో పాలసీ అమలుచేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

అమృతలూరు, జూన్ 5 (ప్రభాతవార్త) : ప్రజా సమస్యల పరిష్కార దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వేమూరు శాసన సభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 74అర్జీలు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం వారి సమస్యలను నేరుగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, భూ సమస్యలు, సంక్షేమ పథకాలు అమలు, త్రాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను వినతిపత్రాల రూపంలో అందజేశారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ సేవలను వేగవంతంగా అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మరియు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, మహిళలు, యువతతో పాటు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణపై అందరూ బాధ్యత కలిగి ఉండాలి

అమృతలూరు, జూన్ 5 (ప్రభాతవార్త) : పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న నేపధ్యంలో అమృతలూరు సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి ఆర్యవైశ్య కళ్యాణ మండపం వరకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సైకిల్ వినియోగం ద్వారా వాయు కాలుష్యం తగ్గడంతో పాటు ఇంధన పొదుపు జరుగుతుందని, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ప్రపంచం ప్రస్తుతం వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం, వంటి సవాళ్లను ఎదుర్కొంటోందని, వాటిని అధిగమించేందుకు ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పులకు దారి తీస్తాయని పేర్కొంటూ ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వహించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వృక్ష సంరక్షణపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీలో కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువత కార్యకర్తలు పర్యావరణ ప్రేమికులు భారీ సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## ప్రముఖ స్వచ్ఛంద సంస్థ మాస్ జెండా ఆవిష్కరణ

తెనాలి జూన్5(ప్రభాతవార్త): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న మాస్ సంస్థ జెండా ఆవిష్కరించడం అభినందనీయని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్,ప్రొఫిసర్ పొన్నెకంటి జోసెఫ్ రత్నాకర్ పేర్కొన్నారు.పట్టణంలోని మార్కెట్ సెంటర్ వద్ద ఎస్ఎన్ఆర్ కార్యాలయంలో మాస్ జెండాను సురేష్ కుమార్,రత్నాకర్ ముఖ్యఅతిథిలుగా పాల్గొని శుక్రవారం ఆవిష్కరించారు.అనంతరం ఇటీవల తెనాలి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన న్యాయవాది ఇందుపల్లి రాజా రామ్,గుంటూరు జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ గా నియమితులైన కొక్కిలిగడ్డ సునీల్ కుమార్లకు మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్దపల్లి నాగరాజు ఆధ్వర్యంలో సత్కారం నిర్వహించారు.ఈ సందర్భంగా కత్తెర సురేష్ మాట్లాడుతూ మాదిగ జాతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నాగరాజు అభినందనీయుడని, బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన రాజా రామ్, విజిలెన్స్ కమిటీ నెంబర్ గా నియమితులైన సునీల్ కుమార్లకు అభినందనలు తెలియజేశారు.పొన్నెకంటి రత్నాకర్ మాట్లాడుతూ మాదిగ జాతి కోసం కృషి చేస్తున్న రాజా రామ్,సునీల్ కుమార్లకు మాస్ ఆధ్వర్యంలో సత్కారం చేయడం సంతోషమని అన్నారు.న్యాయవాది సుద్దపల్లి మురళీధర్ మాట్లాడుతూ 25 ఏళ్ల నుంచి జాతి కోసం సుద్దపల్లి నాగరాజు పాటుపడుతున్నాడని తెలిపారు. సుద్దపల్లి నాగరాజు మాట్లాడుతూ మాదిగల అభివృద్ధి కొరకు తమ వంతు కృషి చేస్తానని చెప్పారు మాస్ రాష్ట్ర అధ్యక్షులు కూచిపూడి మోహన్ మాదిగ,మాస్ రాష్ట్ర ప్రోగ్రా మ్ కన్వీనర్ కోట్ల దిలీప్,జిల్లా అధ్యక్షులు లింగాల రమేష్,రావూరి సతీష్,ఆర్.దేవా,ఆర్ వినయ్, పోతుల రాజా బాబు,కొండమూది బోస్ బాబు,నలుకుర్తి రమేష్,అత్తోట చంటి,అత్తోట శరత్, అత్తోట శ్యామ్, మట్లపూడి రాజేశ్వరరావు, వేజండ్ల సుధాకర్,యడ్లపల్లి రవి కిరణ్, మల్లవరపు బాబీ,న్యాయవాదులు పాల్గొన్నారు.



## ఓటరు సర్వేలో కార్యకర్తలే కీలకం: ఆలపాటి

తెనాలి మున్సిపాలిటీ జూన్5(ప్రభాతవార్త): ఓటరు సర్వే కార్యక్రమంలో ప్రతి బూత్ నుండి బూత్ ఏజెంట్ పాల్గొని బి.ఎల్.ఓ తో పాటు బూత్ పరిధిలో అవసరమైన ఏ ఒక్క ఓటు పోకుండా జాగ్రత్త పడాలని శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ సూచించారు. రామలింగేశ్వర పేటలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ క్లస్టర్,యూనిట్ ఇంచార్జిలు,బి.ఎల్.ఏ లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ..సర్.. గురించి ఆలపాటి రాజేంద్రప్రసాద్ వివరించారు.



## త్వరలోనే నూతన పోలీస్ సబ్సిడీ క్యాంటీన్ పెట్రోల్ బంక్ ఏర్పాటు

బాపట్ల, జూన్ 5, ప్రభాతవార్త ప్రతినిధి : పోలీస్ శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) విభాగం విధులు అత్యంత కీలకమైనవని, శాంతిభద్రతల పరిరక్షణలో ఈ విభాగం పాత్ర ఎనలేనిదని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని ఏఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్), ఎమ్.టి (మోటార్ ట్రాన్స్‌పోర్ట్) విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయానికి చేరుకున్న ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయుధాగారం, బాంబ్ డిస్పోజల్ (బీడీ) టీమ్, డ్యూటీ ఆఫీస్, రికార్డులను నిశితంగా పరిశీలించి, అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**త్వరలో సబ్సిడీ క్యాంటీన్.. పెట్రోల్ బంక్!**

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తమ ప్రభుత్వం, శాఖ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఇందులో భాగంగా ఏఆర్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేయబోయే వివిధ ప్రాజెక్టుల స్థలాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలీస్ సబ్సిడీ క్యాంటీన్ సిబ్బందికి నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకే అందించేందుకు ఏఆర్ కార్యాలయ ఆవరణలో త్వరలోనే నూతన క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నూతన పెట్రోల్ బంక్ డిఎస్పీ కార్యాలయం పక్కన గల స్థలంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సరికొత్త పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, ప్రజలతో పాటు పోలీస్ వాహనాలకు నాణ్యమైన ఇంధనాన్ని అందించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. "కార్యాలయ పరిసరాలను ఎల్లప్పుడూ అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలి. విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదన్నారు.

**ఏఆర్ సిబ్బంది విధులు అత్యంత కీలకం**

జిల్లాలో ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా శాంతిభద్రతలను కాపాడటంలో ఏఆర్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ కొనియాడారు.ముద్దాయిలను కోర్టులకు, జైళ్లకు సురక్షి తంగా తరలించడం,వీఐపీలకు ఎస్కార్ట్ విధులు నిర్వహించడం,బాంబ్ డిస్పోజల్ టీమ్ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండటం వంటివి అత్యంత బాధ్యతాయుతమైన విధులను ఆయన గుర్తుచేశారు.

వాహనాల ఫిట్‌నెస్ డ్రైవర్లదే బాధ్యత అన్నారు. అనంతరం మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (ఎమ్.టి) కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ, అక్కడ ఉన్న పోలీస్ వాహనాలను స్వయంగా తనిఖీ చేశారు. పోలీస్ వాహనాలను సక్రమంగా మెయింటెనెన్స్ చేయాలని, అవి ఎల్లప్పుడూ రన్నింగ్ కండిషన్‌లో ఉండేలా చూసుకోవాల్సిన పూర్తి బాధ్యత సంబంధిత వాహన డ్రైవర్లపైనే ఉంటుందని స్పష్టం చేశారు.

**శక్తి రెస్ట్ రూమ్ బస్సు పరిశీలన:**

ముఖ్యమైన బందోబస్తులు, వీఐపీల పర్యటనల సమయంలో వివిధ ప్రాంతాల నుండి విధులకు వచ్చే మహిళా పోలీస్ సిబ్బంది సౌకర్యార్థం ప్రత్యేక సదుపాయాలతో రూపొందించిన "శక్తి రెస్ట్ రూమ్ బస్సు" లోని వసతులను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఈ బస్సు నిర్వహణ లోపాలు లేకుండా ఉండాలని, మహిళా సిబ్బంది విధుల్లో ఉన్నప్పుడు ఇది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ ఆకస్మిక తనిఖీలు మరియు క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో బాపట్ల డిఎస్పి సిహెచ్. చంద్రమౌళి, ఎస్బి సిఐ జి.నారాయణ, అడ్మిన్, ఎమ్.టి, హోంగార్డ్ ఆర్.ఐ లు మొలుద్దీన్, శ్రీకాంత్, ప్రదీప్, బాపట్ల పట్టణ సిఐ రాంబాబు, రూరల్ సిఐ ప్రభాకర్ మరియు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓసిల సమస్యలు గంటల్లో పరిష్కారం
### ఓబీసీల సమస్యలు మాత్రం ఏళ్లకు ఏళ్లు

తాడేపల్లి, జూన్ 5, ప్రభాతవార్త: ఓసీల సమస్యలు గంటల్లో పరిష్కరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, ఓబీసీ సమస్యలు మాత్రం ఏళ్లకు ఏళ్లయినా ఎందుకు పరిష్కరించలేకపోతుందో అర్థం కావడం లేదని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. శుక్రవారం రాష్ట్ర కార్యాలయంలో "స్థానిక సంస్థల ఎన్నికలు వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు " అంశంపై జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.అగ్రవర్ణ పేదలకంటూ ఈడబ్ల్యూఎస్ పేరిట పది శాతం రిజర్వేషన్ల కేటాయింపు ను,కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు పార్లమెంటు గంటల వ్యవధిలో రాజ్యాంగాన్ని సవరించేసి మరి పరిష్కరించిందన్నారు. కానీ ఓబీసీ సంఘాలు సామాజిక న్యాయం కోసం దేశవ్యాప్తంగా మూడు దశాబ్దాల నుండి ఉద్యమిస్తున్నప్పటికీ,జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కేటాయించడానికి మాత్రం కేంద్ర ప్రభుత్వానికిదేశ అత్యున్నత చట్టసభలకు ఏళ్ళకుఏళ్లు నిండుతున్నా చేతులు రావడం లేదన్నారు. సుప్రీమ్ 50 శాతం పరిమితి రద్దు పరచకుండా 42 శాతం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గారి, 34 శాతం ఏపీ సీఎం చంద్రబాబు గాని బీసీలకు స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఎలా కల్పించగలుగుతారని వారు సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రాలలో స్థానిక ఎన్నికలకు గడువు సమీపిస్తుండటంతోనే, ప్రభుత్వాధినేతలకు ఓబీసీల రిజర్వేషన్లు గుర్తుకు రావడం విచారకరమన్నారు. దేశవ్యాప్త ఓబీసీ సంఘాలతో పాటు మొత్తం రాజకీయ వ్యవస్థ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ఎన్డీఏ సర్కారును ఒప్పించాలన్నారు. మూడు నాలుగు శాతం కూడా లేని అగ్రవర్ణ పేదల గురించి ఇన్నేళ్లు పట్టించుకోని పాలకులు ఈనాడు ఆగమేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లిచ్చి, దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఓబీసీలకు మాత్రం జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు ఇవ్వకుండా మొండి చేయి చూపడం అన్యాయమన్నారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్ పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

## *53 ఏళ్లుగా నివాసం, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లకు నోచుకోని పేదలు...*

తెనాలి మున్సిపాలిటీ జూన్5(ప్రభాతవార్త): 1972లో పేదలైన తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కూరపాటి రంగరాజు, కూరపాటి వెంకటరామరాజు ఆధ్వర్యంలో అప్పటి బీసీ నాయకులు, సేవారత్న తంగెళ్ల శేషం రాజు నీ కలిసి విన్నవించుకోగా, వారి బాధలను గమనించిన శేషం రాజు అప్పటి సబ్ కలెక్టర్ చిత్రా రామచంద్రన్ తో మాట్లాడి బంధువులందరికీ ఇళ్ల పట్టాలు ఇప్పించారు. అప్పటి నుంచి సర్వే నెంబర్లు 125, 125/1, 125/1తి, 125/1తీ, 126 లలో దాదాపు 53 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని బాధితులు తెలిపారు. అయితే ప్రస్తుతం ఈ స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయడం లేదని, దీంతో పిల్లల చదువులు, ఇతర అవసరాలకు బ్యాంకుల నుండి రుణాలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.తమకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను సెక్షన్ 22తి నుండి మినహాయింపు ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేయాలని కోరుతూ మండల తాసిల్దారు వారికి మెమొరండం సమర్పించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకర్రావు, తెనాలి పట్టణ బట్రాజు సంఘం అధ్యక్షులు లోలబట్టి గంగరాజు, కోశాధికారి కూరపాటి సీతారామరాజు, టీడీపీ పార్లమెంటరీ కన్వీనర్ సరికొండ రమాదేవి, కూరపాటి కొండం రాజు, కూరపాటి మట్టం రాజు, సరికొండ సోమరాజు, ఇనపకుతిక విజయలక్ష్మి, తంగెళ్ల సత్యనారాయణ రాజు, ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.53 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమ సమస్యను పరిష్కరించి రిజిస్ట్రేషన్లకు అనుమతించాలని, తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని బాధితులు కోరుతున్నారు.



## తెనాలి ఆటోనగర్‌లో అధికారుల తనిఖీ

తెనాలి జూన్5(ప్రభాతవార్త): తెనాలి ఆటోనగర్‌లో మే నెల 26వ తేదీన సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లిన నేపథ్యంలో, జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఆటోనగర్‌లోని పరిశ్రమలపై సమగ్ర సేఫ్టీ ఆడిట్‌ను ప్రారంభించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, మహిళా పోలీస్, పోలీస్, అగ్నిమాపక, పరిశ్రమలు, ఫ్యాక్టరీలు సహా అన్ని శాఖల సమన్వయంతో ఈ తనిఖీలు చేపట్టారు. ఆటోనగర్‌లో సుమారు 428 యూనిట్లు ఉండగా, అనధికారిక సమాచారం ప్రకారం ఈ సంఖ్య 500 వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ఈ తనిఖీల్లో భాగంగా,మొత్తం యూనిట్లను 100 చొప్పున బృందాలుగా విభజించి ప్రతి యూనిట్‌ను క్షుణ్ణంగా వెరిఫై చేస్తున్నారు. ఆయా వ్యాపారాలను ఓనర్లే స్వయంగా నిర్వహిస్తున్నారా లేక ఇతరులకు లీజుకు ఇచ్చారా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఒకవేళ లీజుకు ఇచ్చి ఉంటే, లీజు తీసుకున్న వ్యక్తి అధికారికంగా ఉండాల్సిన అన్ని అనుమతులు, లైసెన్సులు కలిగి ఉన్నారా లేదా అని పరిశీలిస్తున్నారు.ప్రమాదకరమైన, ఫ్లమబుల్ మెటీరియల్‌ను నిబంధనల ప్రకారం నిల్వ చేశారా? అనుమతించిన పరిమాణం కంటే ఎక్కువగా స్టోరేజ్ చేస్తున్నారా అనే అంశాన్ని తనిఖీ చేస్తున్నారు. ఏదైనా ఫైర్ ఆక్సిడెంట్ జరిగినప్పుడు అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి సరైన భద్రతా మార్గదర్శకాలు, శిక్షణ ఇచ్చారా లేదా అనే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నారు.ఈ సమగ్ర సర్వేను ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. "ఇది కేవలం ముందు జాగ్రత్త చర్య మాత్రమే. వ్యాపారులు, యూనిట్ యజమానులు ఎవరూ ఎలాంటి అపోహలకు గురికావద్దు. అందరి భద్రతే మా లక్ష్యం. అన్ని శాఖల సమన్వయంతో కాంప్రహెన్సివ్‌గా సేఫ్టీ ప్రికాషన్స్ గైడెన్స్ ఇవ్వడమే ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశం" అని ఆయన స్పష్టం చేశారు. గత నెల 26న జరిగిన అగ్నిప్రమాదం తర్వాత ఆటోనగర్‌లో భద్రతా ప్రమాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ తనిఖీల నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.



## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా,ఎంఎల్సి ఆలపాటి సైకిల్ ర్యాలీ

తెనాలి మున్సిపాలిటీ జూన్5(ప్రభాతవార్త): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు గురువారం సాయంత్రం తెనాలి పట్టణంలో, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుండి రజక పేటలోని చాకలి ఐలమ్మ పార్కు వరకు జరిగిన ఈ ర్యాలీలో శాసన మండలి సభ్యులు, తెనాలి టీడీపీ ఇంచార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ సైకిల్ ర్యాలీ చేపట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని పర్యావరణ నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, మొక్కలు నాటడం, కాలుష్య నివారణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ర్యాలీ ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



## గుంటూరు మిర్చియార్డులో భోజన ఏర్పాట్లు భేష్ ..!

గుంటూరు జూన్ 5 ప్రభాత వార్త ప్రతినిధి : గుంటూరు మిర్చియార్డులో రైతుల కోసం ఏర్పాటు చేసిన భోజన సదుపాయాలు మెరుగ్గా వున్నాయని మిర్చియార్డు పాలక వర్గ సభ్యులు సంతృప్తిని వ్యక్తం చేశారు. శుక్రవారం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటి సమావేశం మార్కెట్ కమిటి కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుర్రా అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటి మార్చి నెల ఆదాయ వ్యయాల పై చర్చ జరిగింది. అదేవిధంగా మిర్చి యార్డులో రైతులకు మెరుగైన వసతుల కల్పన, రైతు రెస్ట్ హౌస్ నందు రైతుల ఉపయోగార్ధము గ్రంధాలయం ఏర్పాటు, అభివృద్ధి పనులకు సంబంధించి వివిధ అంశాలపై కమిటీ సభ్యులు ఈ సమావేశంలో సమాలోచనలు చేశారు. 2026 సీజన్ లో మిర్చియార్డు నందు రైతులకు ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహార సదుపాయం , మధ్యాహ్న భోజన ఏర్పాట్లు గతంలో కన్నా మెరుగైన విధముగా చేపట్టడం జరిగిందని కమిటి సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గుంటూరు డి సి ఎం ఎస్ చైర్మెన్ వడ్రాణం హరిబాబు, కార్యదర్శి ఎ.చంద్రిక, వైస్ చైర్మెన్ బిట్రగుంట మల్లిక, ఇతర పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్‌పై
## ప్రజాదర్బార్‌కు చేరిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

బాపట్ల, జూన్ 5, ప్రభాతవార్త ప్రతినిధి : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు శుక్రవారం సైకిల్‌పై మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పచ్చని, కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే ప్రజా దర్బార్ నిర్వహణ ఉద్దేశమన్నారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్‌పై
## మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

బాపట్ల, జూన్ 5, ప్రభాతవార్త ప్రతినిధి : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు శుక్రవారం సైకిల్‌పై మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు.అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పచ్చని, కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే ప్రజా దర్బార్ నిర్వహణ ఉద్దేశమన్నారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## కన్నుల పండువగా కార్యసిద్ది అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

కొల్లిపర,జూన్ 5 ప్రభాతవార్త: మండల పరిధిలోని కొల్లిపర కృష్ణానది సమీపంలో కరకట్టపై వేంచేసి వున్న శ్రీకార్యసిద్ధి అభయ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షికోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.అర్చకులు పరాశరం జగన్నాధాచార్యులు,పోగుల రామలింగేశ్వశర్మ,పరాశరం రామాచార్యులు పర్యవేక్షణలో ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం,లక్ష తమలపాకులతో విశేషపూజలు నిర్వహించారు. అనంతరం సువర్చలాసమేత శ్రీఅభయ ఆంజనేయస్వామి శాంతి కళ్యాణం నిర్వహించారు.ఈ కళ్యాణంలో పుణ్యదంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కళ్యాణాన్ని భక్తులు తిలకించారు.ఈ కార్యక్రమానికి మండలంలోని చుట్టుప్రక్కల గ్రామప్రజలతో పాటు కొల్లిపర గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కళ్యాణాన్ని పురస్కరించుకుని ఉదయం నుండి 3 గంటల వరకు రేపల్లె విజయవాడ బస్సులు రద్దీగా నడిచాయి.



## చెట్లను పెంచటంతో పర్యావరణం పరిరక్షించుకోవచ్చు

కొల్లిపర,జూన్ 5 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచటం వలన ప్రజారోగ్యానికి మేలు జరుగుతుందని మండల వైద్యాధికారి నేహ అన్నారు.శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులతో కలసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నేహ మాట్లాడుతూ చెట్లను పెంచటం వలన పర్యావరణం పరిరక్షించుకోవచ్చన్నారు.వర్షాలు పడాలంటే చెట్లను తప్పనిసరిగా పెంచాలన్నారు.కార్యక్రమంలో ఎంఈవో ఝాన్సిలత,ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మీ,శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



## చమురు ధరలు తగ్గించాలంటూ వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం

తెనాలి జూన్5(ప్రభాతవార్త): పెరిగిన చమురు ధరలు తగ్గించాలంటూ,సిపిఐ, సిపిఎం వామపక్షాల ఆధ్వర్యంలో పట్టణంలోని, చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సిపిఎం నాయకులు,తెనాలి పట్టణ కార్యదర్శి కే.బాబు ప్రసాద్ మాట్లాడుతూ, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు టాక్స్ లను తగ్గించాలని కేజీ బేసిన్ నుండి వెలికి తీసి న గ్యాస్ లో సగం మన వాటా మనకు కేటాయించాలని, అమెరికా ఆదేశాలను ప్రక్కన పెట్టి చౌకగా ఇచ్చే దేశాల వద్ద ఇంధనం కొనుగోలు చేయాలని, దేశంలో కొత్తగా ఇంధనం అన్వేషణ కు ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్జిసి దృష్టి సారించాలని, రష్యా, ఇరాన్ నుంచి గ్యాస్ ముడి చమురు కొనుగోలు చేయలేని కోరుతూ జూన్ 9 న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే రాస్తారోకో జయప్రదం చేయాలని కోరారు.సిపిఐ (ఎంఎల్)పార్టీ నాయకులు లోకం భాస్కరరావు మాట్లాడుతూ,ప్రభుత్వ దుర్మార్గ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలు పాల్గొనాలని కోరారు.సిపిఎం కొల్లిపర మండల కార్యదర్శి ఎం.శివసాంబిరెడ్డి మాట్లాడుతూ,వ్యవసాయ చేయుట కూడా రాబోయే రోజుల్లో కష్టం అవుతుంది అని చెప్పారు. బుద్ధిస్ట్ సొసైటీ నాయకులు వై.అశోక్ మాట్లాడుతూ, ప్రభుత్వం పేదల పై భారాలు వేస్తున్నారని విమర్శించారు వేతనాలు పెంచుట లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎం.సాంబశివరావు కుర్రా రమణ,పి.రాజశేఖర్ షేక్.హుస్సేన్ వలి, వై.ఈశ్వరి ఏవిఎన్.కుమారి,సుజాత, కే.చెంచయ్య ,టి.మహంకాలయ్య ,కే.అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా చర్చావేదిక

తెనాలి జూన్5(ప్రభాతవార్త):జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని, శ్రీనివాస కళ్యాణ మండపంలో నిర్వహించిన జాతీయ మానవ హక్కుల సమావేశం అత్యంత వైభవంగా, ఘనంగా జరిగింది. దేశంలోని పలువురు ప్రముఖులు, మేధావులు, సామాజిక సేవకులు మరియు వివిధ రంగాలకు చెందిన విశిష్ట వ్యక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని సమావేశానికి మరింత గౌరవాన్ని తీసుకువచ్చారు. మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సమానత్వం వంటి ముఖ్యమైన అంశాలపై జరిగిన చర్చలు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచాయి.ఇటీవల తెనాలిలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు సమావేశం సందర్భంగా నిత్యావసర సరుకులు, దుస్తులు మరియు ఇతర అవసరమైన సహాయ సామగ్రిని అందించడం జరిగింది. ఈ సేవా కార్యక్రమం బాధిత కుటుంబాలకు కొంత ఉపశమనం కలిగించడమే కాకుండా, మానవత్వం మరియు సామాజిక బాధ్యత పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబించింది.అదేవిధంగా, ఇటీవల తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీమతి రాజేశ్వరి గారి సహకారంతో చిన్నారులకు పండ్లు, బ్రెడ్ మరియు కొత్త దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల ముఖాల్లో ఆనందాన్ని నింపడంతో పాటు, సేవా భావం మరియు మానవతా దృక్పథాన్ని చాటిచెప్పింది.ఈ సమావేశానికి విచ్చేసిన జాతీయ మానవ హక్కుల సంస్థ ప్రముఖులు ఈదురూ పద్మాకర్ (నేషనల్ చైర్మన్), యనమల ఈశ్వర్ రావు (నేషనల్ వైస్ ప్రెసిడెంట్), గద్దం శివకృష్ణ (నేషనల్ జనరల్ సెక్రటరీ),ఎం. సునీల్ కుమార్ (నేషనల్ సెక్రటరీ), కె. చిన్నవాడు (నేషనల్ ట్రెజరర్), జి. ఆది అప్ప (నేషనల్ ట్రెజరర్II), ఆరోన్ జె. బాలబధర(నేషనల్ డైరెక్టర్, ముంబై, మహారాష్ట్ర),డి. సతీష్ కుమార్ (నేషనల్ డైరెక్టర్, చెన్నై, తమిళనాడు), శ్రీమతి జి. భావన (నేషనల్ డైరెక్టర్, మహిళా విభాగం) కె. ఆంజనేయ శర్మ. స్టేటె కోఆర్డినేటర్ ఆంధ్రా ప్రదేశ్ (మీడియా) లకు ఘన సన్మానం నిర్వహించడం జరిగింది. వారి సేవలను గుర్తిస్తూ జ్ఞాపికలు (మొమెంటోలు) అందజేసి ప్రత్యేకంగా సత్కరించారు.ఇంతటి ప్రతిష్ఠాత్మక వేదికపై గొప్ప వ్యక్తులను కలుసుకోవడం, వారి ఆలోచనలు వినడం నిజంగా ఆనందదాయకమైన అనుభూతిని కలిగించింది .సమాజ సంక్షేమం, మానవ హక్కుల పరిరక్షణ మరియు అవసరంలో ఉన్న వారికి అండగా నిలవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం మరింత బలంగా చాటిచెప్పింది.

## పేటలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిలకలూరిపేట, జూన్ 5, ప్రభాతవార్త: రైతు బజార్ ప్రాంగణంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మరణించి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే అర్బన్ ఎస్ఐ సోమేశ్వరరావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు.మృతుడు తెల్ల చొక్కా, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఎస్ఐ సోమేశ్వరరావు , ఆ వ్యక్తి ఎవరనేది గుర్తించేందుకు వివరాలు సేకరిస్తున్నారు.

## చిలకలూరిపేట మోటార్ వర్కర్స్ దశాబ్దాల కల సాకారం

### -11న ఎమ్మెల్యే 'ప్రత్తిపాటి' చేతులమీదుగా ఆటోనగర్ ప్రారంభం

చిలకలూరిపేట, జూన్ 5, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గంలోని మోటార్ వర్కర్స్ దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఆటో నగర్ కలలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సాకారం చేసినట్లు కూటమి నాయకులు తెలిపారు. గత వైసీపీ పాలనలో ఎటువంటి చర్యలకు నోచుకోకుండా నిలిచిపోయిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ముందుకు తీసుకువెళ్లి ఆటో నగర్ ఏర్పాటుకు ప్రత్తిపాటి పుల్లారావు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. మోటార్ వర్కర్స్ సమస్యలు, వారి వృత్తి ఇబ్బందులు బాగా తెలిసిన నాయకుడిగా, వారికి శాశ్వత స్థలం కల్పిస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఆటో నగర్ నిర్మాణాన్ని పూర్తి చేయించి, అన్ని వృత్తుల వారూ ఒకేచోట తమ వ్యాపారాలు, పనులు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేసిన ఘనత ప్రత్తిపాటిదే అని నాయకులు కొనియాడారు.



ఆటో నగర్ ఏర్పాటుతో వందలాది కుటుంబాలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు, మెరుగైన వసతులు, వ్యాపారాభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించబడిందని తెలిపారు. మోటార్ వర్కర్స్ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ ఆటో నగర్‌కు " ప్రత్తిపాటి పుల్లారావు ఆటో నగర్" అని నామకరణం చేయడం జరిగిందన్నారు. ఈ ఆటో నగర్ ప్రారంభోత్సవ కార్యక్రమం 11062026 ఉదయం 9.00 గంటలకు ఘనంగా నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం, తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక నందమూరి తారక రామారావు విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమాలు కూడా నిర్వహించబడనున్నాయి. చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరీముల్లా , పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్ , ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి , మోటార్ వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ అధ్యక్షులు నల్లమోతు సాంబశివరావు (బుజ్జి మేస్త్రి) ,ఉపాధ్యక్షులు ఎస్.కె. బాబు మేస్త్రి ,ప్రధాన కార్యదర్శి తిరులో ఏడుకొండలు , కార్యదర్శి అనంత శ్రీనివాసరావు, ఉప కార్యదర్శి ఖుద్దూస్ , ట్రెజరర్ పఠాన్ నబీఖాన్ ,కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆటో వర్కర్స్, మోటార్ మెకానిక్స్, కార్మికులు, వ్యాపారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

### -కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటిన జడ్జి నరేంద్రరెడ్డి

చిలకలూరిపేట, జూన్ 5, ప్రభాతవార్త: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఆవరణలో ఘనంగా పర్యావరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కె.నరేంద్ర రెడ్డి కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒక రోజుకు పరిమితం కాకూడదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణాన్ని కాపాడుకోవాలని కాలుష్య రహిత సమాజ స్థాపన కోసం ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడటం కోసం న్యాయస్థానాలు ఎల్లప్పుడూ ముందంజలో ఉంటాయని, ఎం.సి. మెహతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా వంటి ఎన్నో కీలక తీర్పుల ద్వారా, అలాగే గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం వంటి చట్టపరమైన రక్షణల ద్వారా కాలుష్య రహిత సమాజం కోసం న్యాయవ్యవస్థ ఎంతో కృషి చేస్తోందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత మరియు రాబోయే తరాల భవిష్యత్తు కోసం పర్యావరణ ప్రాముఖ్యతను గుర్తించి, ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మరియు ఈ అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని జడ్జ్ నరేంద్ర రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



## 'విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటాలొద్దు'

చిలకలూరిపేట, జూన్ 5, ప్రభాతవార్త:దేశవ్యాప్తంగా యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారి ఉపాధి భవిష్యత్తు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి ఆరాధ్యుల రామకృష్ణ అన్నారు.నీట్ అక్రమాలపై ఆగ్రహం ఈ సందర్భంగా సిపిఐ మాజీ కార్యదర్శి నాగవైరు సుబ్బాయమ్మ మాట్లాడుతూ ఇటీవల నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం లక్షలాదిమంది విద్యార్థుల కలలను చిన్నభిన్నం చేసిందని మండిపడ్డారు దేశ భవిష్యత్తుకు వెన్నెముక వంటి యువతను ఇలాంటి అక్రమాలతో ఇబ్బందులకు గురి చేయడం దారుణమని దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ పట్టణం మాజీ కార్యదర్శి నాయుడు శివ కుమార్ అన్నారుఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు షేక్ ఖాదర్, ఏఐఎస్ఎఫ్ మాజీ విద్యార్థి సంఘ నాయకులు బొంత భగత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు



## రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



చిలకలూరిపేట (నాదెండ్ల), జూన్ 5, ప్రభాతవార్త:నాదెండ్ల మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో జీలుగ, జనుము, పిల్లి పెసర పచ్చి రొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. కిలో జీలుగ రూ. 80, జనుము రూ. 77, పిల్లి పెసర రూ. 98 ధరకే రైతులకు లభిస్తాయని, ఎకరాకు 10 కిలోల జీలుగ/జనుము లేదా 8 కిలోల పిల్లి పెసర చొప్పున పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి శ్రీలత తెలిపారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాదెండ్ల గ్రామం లో నాదెండ్ల సొసైటీ ఛైర్మన్ నల్లమోతు హరిబాబు ద్వారా రైతులకు విత్తనాలను అందచేశారు.

## యువత భవిష్యత్తుతో చెలగాటం వద్దు: ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ సింహ

చిలకలూరిపేట, జూన్ 5, ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వాలు వారి ఉపాధి, భవిష్యత్తు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ సింహ ఆవేదన వ్యక్తం చేశారు. కోటప్పకొండలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు వచ్చిన ఆయన, స్థానిక సిపిఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా రోషన్ కుమార్ సింహ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల కలలను చిన్నాభిన్నం చేసిందని మండిపడ్డారు. దేశ భవిష్యత్తుకు వెన్నెముక వంటి యువతను ఇలాంటి అక్రమాలతో ఇబ్బందులకు గురి చేయడం దారుణమని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నవంబర్ నెలలో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో సుదీర్ఘ లాంగ్ మార్చ్ చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సంతోష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి యుగంధర్, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



## మాటల నాయకుడు కాదు... చేతల నాయకుడు....
## మహనీయుల గౌరవాన్ని కాపాడిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

### - చిలకలూరిపేట దళిత సమాజం కృతజ్ఞతలు

చిలకలూరిపేట, జూన్ 5, ప్రభాతవార్త: పట్టణ నడిబొడ్డున ఉన్న ఎన్.ఆర్.టి సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి అడ్డంగా ఒక భారీ హోర్డింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై పార్టీలకు అతీతంగా దళిత సంఘాలుస్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావ దృష్టికితీసుకువెళ్లగా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వెనువెంటనే స్పందించి హోర్డింగ్‌ను తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దళిత సంఘాల నాయకులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.... అంబేద్కర్ విగ్రహానికి అడ్డంగా హోర్డింగ్ కట్టడం మా మనోభావాలను దెబ్బతీసిందని,. ఎమ్మెల్యే కి విన్నవించగా వారిఆవేదనను అర్థం చేసుకుని నిమిషాల వ్యవధిలోస్పందించి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చొరవ అభినందనీయమన్నారు. దళితుల పక్షాన నిలబడే చేతల నాయకుడు అని నిరూపించుకున్నారని తెలిపారు. పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుళ్ళి చిన్న బాబును శాలువాతో సత్కరించారు తెలుగుదేశం పార్టీ నాయకులు,దళిత సంఘాలనాయకులుమైల గణేష్,కుంగుపు కృష్ణ,అన్నలదాసు బుల్లి,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బడుగు యాకోబ్ శరత్,జంగా సురేష్,నంబూరి ఏడుకొండలు,కుళ్ళి రాజారావు,కుళ్ళి పెదబాబు,తదితరులు పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## అభివృద్ధిపై మాట్లాడేందుకు భయపడి పోలీసులను ఉసిగొలిపారు: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

### పోలీసులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు మధ్య తోపులాట

నరసరావుపేట, జూన్ 5 ప్రభాతవార్త : నరసరావుపేట అభివృద్ధి పై ఎమ్మెల్యేకు చర్చించే ధైర్యం లేక పోలీసులను నాపై ఉసిగొలిపి హౌస్ అరెస్ట్ చేయించాడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ నిన్న సాయంత్రం 6 గంటల నుంచి పోలీసులు ఇంటి చుట్టూ ముహరించి నిర్బంధం లో ఉంచారని తెలియజేశారు. ఏ అభివృద్ధి చేయలేదనీ, చర్చకు వస్తే తన అవినీతి బయట పడుతుందని అని తప్పించుకునే కార్యక్రమం చేశారన్నారు. నియోజకవర్గంలో రూ.2450కోట్లరూపాయలుఅభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కోటప్పకొండ అభివృద్ధి కొరకు వైకాపా హయాంలో సుమారు రూ.33 కోట్ల రూపాయలు అభివృద్ధి క చేశామని గుర్తు చేశారు. కోటప్పకొండ నరసరావుపేట రోడ్డు రూ.11 కోట్లు,దేవాలయ రాజగోపురం,మహామండపం , ఆర్చి గేట్లు మెట్ల మార్గంలో షెడ్లు , క్యూ కాంప్లెక్స్ లో ఐరన్ గేట్లు,మేధా దక్షిణామూర్తి విగ్రహం, ఏకశిలానందీశ్వర విగ్రహం, శివ కుటుంబానికి సంబంధించిన విగ్రహాలు అన్ని కూడా రోడ్లతో సహా కలిపి మొత్తం 33 కోట్ల రూపాయలు )అభివృద్ధి జరిగింది. జెఎన్టియు కళాశా లకు సంబంధించి రూ.139. 27 కోట్లపనులుపూర్తిచేశాము. రొంపిచర్ల మండలం 32.6 కోట్లునరసరావుపేటమండలం 31.26 కోట్లుదేవస్థానముల అభివృద్ధికి రూ.7.8కోట్లరూపాయలు, రొంపిచర్ల లో టీటీడీ కళ్యాణమండపం 2.20 కోట్లు టిడ్కో వీళ్ళ సముదాయం వద్ద 13.20 లక్షలతో (ఓవర్ హెడ్ ట్యాంక్ ,సిమెంట్ రోడ్లు ట్రాన్స్ఫార్మర్లు ,వాటర్ సప్లై అభివృద్ధి చేశామన్నారు. ఇళ్ల పట్టాలునియోజకవర్గంలో 14,510ఇచ్చారు.35సచివాలయాలు,రైతు భరోసా కేంద్రాలు 31,విలేజ్ హెల్త్ క్లినిక్ 4.9 కోట్లు అగ్రికల్చర్ గోడౌన్స్ 2.68 లక్షల రూపాయలు పెద్ద పెద్ద కంపెనీలను అడిగి వారి వద్ద నుంచి నిధులు సేకరించి కమ్యూనిటీ హాల్స్ కట్టిన డబ్బు మొత్తం సొసైటీ 7 కోట్లు, వీర్కో కంపెనీ ద్వారా 50 మంది దివ్యాంగులకు 50 లక్షలతో ట్రైసైకిల్స్ ఇచ్చారు .కాపు ఆరామ క్షేత్ర కొరకు 21లక్షలు ప్రైవేటు నిధులు, 4ఎలక్ట్రికల్ సబ్స్టేషన్ నరసరావుపేట ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసింది మా ప్రభుత్వ హయాంలో అన్నారు.ఇది నరసరావుపేట కే గర్వకారణం.91పాఠశాలలు నాడు నేడు కింద అభివృద్ధి చేశామనితెలిపారు.ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కొరకు 6.5 కోట్లు వ్యయం చేశామన్నారు. చర్చకు వచ్చే క్రమంలో జరిగిన తోపులాటలో నా చొక్కాకు రక్తంమరకలుసైతంఅయినట్లు తెలిపారు.అభివృద్ధి ,సంక్షేమం, అవినీతి దేనిపైనైనా చర్చకు నేను సిద్ధం అని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.



**వైయస్సార్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత :**

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఇంటి వద్ద శుక్రవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డాక్టర్ గోపిరెడ్డిని హౌస్ అరెస్టు చేసి పోలీసులు భారీగా మోహరించ చారు. బహిరంగ చర్చకు ఆయన బయటకు రావడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో వైయస్సార్సీపి నాయకులతో పోలీసులకు వాగ్వాదం,కొద్దిసేపుతోపులాటజరిగింది.మధ్యాహ్నం వరకు ఏసమయంలోఏంజరుగుతుందో తెలియని టెన్షన్ కార్యాలయం వద్ద నెలకొంది.

## చర్చకు భయపడి దాక్కున్న గోపిరెడ్డి: ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట, జూన్ 5 ప్రభాతవార్త : అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరితే భయపడి బాత్రూంలో దాక్కున్నావా గోపిరెడ్డి అంటూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తీవ్రస్థాయిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిపై విరుచుకుపడ్డారు. నరసరావుపేట నియోజకవర్గాన్ని ఎవరు అభివృద్ధి చేశారో చర్చించాలని కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం వద్ద అధికార ప్రతిపక్ష నేతలు సిద్ధమైన తరుణంలో ఎమ్మెల్యే అరవింద బాబు, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిని పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో హౌస్ అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే కావాలని తనను హౌస్ అరెస్టు చేయించారని గోపిరెడ్డి విమర్శలు చేశారు. దానిపై ఎమ్మెల్యే అరవిందబాబు తీవ్ర స్థాయిలో స్పందించారు. అభివృద్ధిపై చర్చకి వచ్చే దమ్ము ధైర్యం ఉంటే పొద్దున్నే 6 గంటలకే కోటప్పకొండకు వెళ్లేవాడివి అని, హౌస్ అరెస్ట్ సాకు చూపి వాష్‌రూమ్‌లో దాక్కున్నావ్ అని ఎద్దేవా చేశారు. మారువేషంలో కూడా బయటకు రాలేక బాత్రూంలో దాక్కున్న నీకు ప్రజల్లో తిరిగే అర్హత లేదని ఎమ్మెల్యే అరవింద బాబు ధ్వజమెత్తారు. త్రికోటేశ్వర స్వామి దేవస్థానం వద్ద బహిరంగ చర్చకు అన్ని ఏర్పాట్లు చేశామని షామియానా, కుర్చీలు వేసి రెడీగా ఉంచామని తెలిపారు. భయపడిన గోపిరెడ్డి రాకపోయినా కనీసం తన అనుచరులు అయినా పంపించి ఉండాల్సిందన్నారు. కూటమి 2 ఏళ్లలో సంక్షేమం, అభివృద్ధికి రూ. 554 కోట్లకు పైగా ఖర్చు చేసామని వివరించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 20 వేల ఓట్ల మెజారిటీతో గోపిరెడ్డిపై గెలిచానని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో జరిగిన అవినీతి, భూకబ్జాలు అన్ని బయటపెడతామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు .



## ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన ఏ.ఎం.రెడ్డి విద్యార్థిని




నరసరావుపేట, జూన్ 5 ప్రభాతవార్త : మండలంలోని పెట్లూరివారిపాలెంలోని ఏఎం.రెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి చెందిన ఫార్మ్.డి విద్యార్థిని వెలగా సూర్య గాయత్రి ప్రతిష్టాత్మకమైన మై భారత్ వైబ్రాంట్ వికసిత్ కార్యక్రమం కింద డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయినట్లు కళాశాల కార్యదర్శి డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం తెలిపారు. జాతీయ స్థాయి కార్యక్రమానికి విద్యార్థిని ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. భార్గవ భూషణ రావు, డీన్ ఆఫ్ అకాడెమిక్స్ ఎ. పావని మాట్లాడుతూ మై భారత్ వికసిత్ భారత్ కార్యక్రమం యువతలో దేశభక్తి, సామాజిక సేవాభావం మరియు నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా వెలగా సూర్య గాయత్రిని అభినందించారు.

## వాగ్దేవి జూనియర్ కళాశాల నూతన భవనం ప్రారంభం

నరసరావుపేట, జూన్ 5 ప్రభాతవార్త : నరసరావుపేటరావిపాడు రోడ్డులోని వాగ్దేవి జూనియర్ కాలేజీ సరస్వతి నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అధ్యక్షతవహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రాము, డాక్టర్ అమూల్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య లు పాల్గొని ప్రారంభించారు. కృష్ణ చైతన్య విద్య సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తో పాటు, డైరెక్టర్లు కళాశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ ఒగూరి నాగేశ్వరరావు, సెక్రటరి కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్స్ కాట్ల రామ కోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్ర ప్రసాద్, పాశం కృష్ణారావు, పి.వి. అచ్యుత రావు అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి



సత్తెనపల్లి, జూన్ 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలంలోని రామకృష్ణాపురంలో ఘోర ప్రమాదం జరిగింది. మట్టి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో, ముప్పాళ్ల మండలం మాదలకు చెందిన వంశీ అనే యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## పాకాలపాడులో అగ్నిప్రమాదం

సత్తెనపల్లి, జూన్ 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం పాకలపాడులో గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య స్థానికంగా కలకలం రేపింది.గ్రామంలోని ఓ ఇంటి సమీపంలో ఉన్న వరి చెత్త కుప్పలకు కొందరు దుండగులు నిప్పు పెట్టడంతో మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారు. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



## విద్యుదాఘాతానికి బాలుడు మృతి

సత్తెనపల్లి, జూన్5, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా చంద్రరాజుపాలెం గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి (కరెంట్ షాక్) గురై ఒక చిన్నారి ప్రాణాలు కోల్పోయిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.గ్రామానికి చెందిన యోహాన్ రాజు (12) అనే బాలుడు శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా బాలుడిని హుటాహుటిన సమీపంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చేర్చిన అనంతరం వైద్యులు బాలుడిని బ్రతికించేందుకు శతవిధాలా ప్రయత్నించారు. అయితే, అప్పటికే పరిస్థితి విషమించడంతో బాలుడు చికిత్స పొందుతూ కన్నుమూశాడు. కళ్లముందే ఆడుకుంటూ తిరిగిన చిన్నారి మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చంద్రరాజుపాలెం గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి.

## నూతనంగా ఎన్నికైన వారికి ఘనసత్కారం

సత్తెనపల్లి, జూన్5, ప్రభాతవార్త: లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడు లయన్ పెద్దింటి వెంకటేశ్వర్లు (2026-27సం. ఎలక్ట్ ) అధ్యక్షతన లయన్స్ జిల్లా 316హెచ్ కేబినెట్ లో పదవులు పొందిన లయన్ కంబాల వెంకటేశ్వరరావు జిల్లా గ్లోబల్ సర్వీస్ టీం (జిఎస్టీ) )కోఆర్డినేటర్ గా, పి. కిషోర్ కుమార్ రీజియన్ చైర్మన్ గా, పి. వీరాంజనేయులు , జోన్ చైర్మన్ గా నియమించబడిన సందర్భంగా క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కంబాల మాట్లాడుతూ గత 44సం. రాలు గా సత్తెనపల్లి లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి క్లబ్ కు జిల్లా లోనే సముచిత స్థానం కల్పించిన లయన్స్ జిల్లా 316బీ గవర్నర్ (2026..27ఎలక్ట్ )లయన్ ఆర్. లక్ష్మీనారాయణకు ధన్యవాదములు తెలియజేసారు. అదే విధంగా రాబోయే ఏడాదికి చేసే సేవలకు ఒక ప్రణాళికను రూపొందించుకొని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమం లో లయన్స్ సభ్యులందరు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



సత్తెనపల్లి, జూన్ 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం రైల్వేస్టేషన్ రోడ్ కేజీబీవీ పాఠశాల లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని తెలిపారు. వివిధ హోదాల్లో వున్న ప్రభుత్వ అధికారులు,రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే 'కన్నా'

సత్తెనపల్లి, జూన్ 5, ప్రభాతవార్త: స్థానిక రఘురామ్‌నగర్‌లోని టిడిపి కార్యాలయం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని కన్నా భరోసా ఇచ్చారు ... ఈ సందర్భంగా ప్రజలు. తన దృష్టికి కొన్ని సమస్యలు. గృహ, పెన్షన్, వైద్యం,పలు సమస్యలు తీసుకొచ్చారని, సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అందరి సమస్యలు పరిష్కరిస్తామని కన్నా హామీనిచ్చారు.



## 'విత్తన గుళికల విధానం రైతుల పాలిట వరం'

సత్తెనపల్లి, జూన్ 5, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి మండలం కట్టవారిపాలెం గ్రామంలో శుక్రవారం విత్తన గుళికల తయారీ, చల్లే కార్యక్రమం నిర్వహించారు. రైతులు దాసరి గిరి, వెల్లటూరి శ్రీనివాసరావు, కృష్ణ వ్యవసాయ క్షేత్రాల్లో 30 రకాల విత్తనాలతో గుళికలను తయారు చేసి పొలాల్లో చల్లారు.ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె. అమలకుమారి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో రైతులు తమ భూమిని పంటలతో కప్పి ఉంచడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.



## భూసారం పెంచేందుకు పీఎండిస్ (నవధాన్య) విధానం పాటించాలి...

సత్తెనపల్లి, జూన్ 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం కట్టవారిపాలెం గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ విధానములో భాగంగా పి ఎం డి ఎస్ (నవధాన్య) విత్తనాల కిట్స్ రైతులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి హాజరు కావడం జరిగింది. ప్రతి ఒక్క రైతు తొలకరి వర్షానికి ముందుగా భూమిలో ఈ 30 రకాల విత్తనాలు చల్లుకోవడం వలన మన భూములు వేసవి తాపానికి గురికాకుండా ఉంటాయని అంతేకాకుండా భూమిలో కర్బన శాతం పెరుగుతుందని తెలియజేయడం జరిగింది. భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని భూమికి నీటిని పట్టి ఉంచే శక్తి పెరుగుతుందని తెలియజేసినారు. కార్యక్రమంలో మండల ప్రకృతి వ్యవసాయ ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ కంచర్ల మధుబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.కె నజీర, చంద్రశేఖర్ గ్రామ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాసరావు,లక్ష్మీ జ్యోతి,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ డిపోలో మహిళను ఢీకొన్న బస్సు: ఆసుపత్రికి తరలింపు



సత్తెనపల్లి, జూన్ 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో శుక్రవారం ప్రమాదం చోటుచేసుకుంది. సత్తెనపల్లి నుంచి మాచర్ల వెళ్తున్న ఆర్టీసీ బస్సు పార్వతి (50) అనే మహిళను ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆస్పత్రికి తరలించారు. అయితే బాధితురాలికి సకాలంలో చికిత్స అందించకుండా ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు ఆరోపించారు. ఈ ఘటనపై అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు

## పిఎం శ్రీ కేంద్రియ విద్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

సత్తెనపల్లి, జూన్ 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విస్తృత స్థాయిలో వృక్షారోపణ కార్యక్రమం జరుఇపారు.. కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ మరియు హరిత జీవన విధానంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో ఔషధ, ఫలదాయక, నీడనిచ్చే మరియు అలంకార మొక్కలను నాటారు. పాఠశాల ప్రధానాచార్యులు జగదీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ వృక్షాలు మానవ జీవనానికి అత్యంత అవసరమని అన్నారు.



## 'సార్'పై దుష్ప్రచారం తగదు: పట్టణ టిడిపి అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్

చిలకలూరిపేట, జూన్ 5, ప్రభాతవార్త: ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సార్) కార్యక్రమంపై కొందరు కావాలనే ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని చిలకలూరిపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శీ।ళి అనేది ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ప్రక్రియ అని, ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హులు మరియు డూప్లికేట్ పేర్లను తొలగించే లక్ష్యంతో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. శీ।ళి వల్ల ఎవరి ఓటు హక్కుకూ ఎటువంటి నష్టం జరగదని, ప్రజలు నిర్భయంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు విశ్వసించవద్దని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో సార్ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి పౌరుడు ఈ ప్రక్రియకు సహకరించాలని పఠాన్ సమద్ ఖాన్ ,పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి విజ్ఞప్తి చేశారు.



